



- నష్టాలతో తగ్గిన మిరప..
- శనగ వెలవెల.. మెరిసిన మొక్కజొన్న
- మిర్చికి ప్రత్యామ్నాయంగా పొగాకు సాగు



సాగు.. తారుమారు

అతివృష్టి.. అనావృష్టి.. తెగుళ్లు.. దిగుబడులు తగ్గడం.. ధరలు లేకపోవడం.. నష్టాలు.. కష్టాలతో.. సాగు చిత్రం ఏటికేడు మారిపోతోంది. పంటల సాగు తారుమారవుతోంది. నష్టాలు.. ధరలను బట్టి రైతులు సాగు చేసే పంటలను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ వస్తున్నారు. ఏటేటా పంటల సాగు మారుస్తున్నా ఏమాత్రం కలసి రావడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా పల్నాడు, గుంటూరు జిల్లాల్లో వాణిజ్య పంటలు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలోని డెల్టాలో వరి ఎక్కువగా సాగవుతుంటోంది. అయితే ఈ సారి వర్షాలు చాలావరకు పంటలను దెబ్బతీశాయి. దీంతో రైతులు సాగు చేసే పంటలను ఏటికేడు మారుస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో గత ఏడాది కన్నా ఈ ఏడు మిరప సాగు 55,804 ఎకరాల్లో తగ్గింది. మిరపకు ప్రత్యామ్నాయంగా పొగాకు.. మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గు చూపారు. గత ఏడాది ఆశాజనకంగా లేక పోవడంతో ఈ ఏడాది శనగ సాగును వేలాది మంది రైతులు వీడారు. మొత్తంగా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో పంటల సాగులో విస్తృత మార్పులు చోటుచేసుకున్నాయి.


(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో ఏటికేడు సాగు చిత్రం మారిపోతున్నది. తెగుళ్లు.. గిట్టుబాటు ధర లేకపోవడం తదితర పరిణామాల నేపథ్యంలో రైతులు ఈ ఏడు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించారు. లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టి పంటలు పండించినా మిగులు లేక అప్పుల ఊబిలో కూరుకుపోతుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై మొగ్గు చూపుతున్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాలో పత్తి, మిర్చి సాగు చేస్తున్న రైతులు విసిగి వేసారిపోతున్నారు. తక్కువ పెట్టుబడులు.. ఎక్కువ దిగుబడులతో.. కొంతైనా లాభాలతో బయటపడే అవకాశం ఉన్న పంటల సాగుకు ఎక్కువ మంది రైతులు ఆశక్తి చూపుతున్నారు. మొక్కజొన్న, పొగాకు సాగు గణనీయంగా పెరగ్గా మిరప, శనగ సాగు అదే స్థాయిలో పతనమైంది. గత ఏడాదికి కన్నా మిరప, శనగ సాగు 1,15,503 ఎకరాల్లో తగ్గింది. మొక్కజొన్న, పొగాకు సాగు గత ఏడాది కన్నా 99,550 ఎకరాల్లో పెరగడం గమనార్హం.


శనగ

పంటల సాగు ఇలా(ఎకరాల్లో)..

పంటలు	గత ఏడాది	ఈ ఏడాది
మిరప	1,71,226	1,15,422
పొగాకు	44,035	91,585
శనగ	1,38,052	78,352
మొక్కజొన్న	52,000	1,09,247


మొక్కజొన్న

ధర పతనంతో తీవ్రంగా నష్టం

గత ఏడాది గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో రైతులు విస్తృతంగా మిరప సాగు చేశారు. వర్షాభావం.. తెగుళ్ల మిరప దిగుబడులపై (మిగతా 8వ పేజీలో)

మంగళగిరి చేనేతకు జీవం



- 10.80 ఎకరాల్లో మెగా చేనేత పార్కు

చేనేతకు మంత్రి నారా లోకేశ్ పునరుజ్జీవం

- నేతన్నల రెండున్నర దశాబ్దాల కల సాకారం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా ఐదు వేల మందికి ఉపాధి
- కంచి సిల్క్ పార్కు తరహాలో ఏర్పాటు చేయాలని మంత్రి సవిత ఆదేశాలు


చేనేత పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి సవిత (ఫైల్)

మంగళగిరి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చేనేత ఖిల్లా మంగళగిరిలో చేనేతకు జీవం పోసేందుకు మంత్రి నారా లోకేశ్ తీసుకున్న సంకల్పం నెరవేరింది. ఒకప్పుడు చేనేత మగ్గాల సవ్వడులతో.. తెల్లవారుతూనే పరిచినట్టు కనిపించే మొలకట్టుడు అల్లికలతో.. సంప్రదాయ కళతో కనువిందు చేసే వీధులతో దర్శనమిచ్చిన నాటి చేనేతకేంద్రం మంగళగిరికి తిరిగి ఆ శోభ సంతరించుకోకున్నది. వివిధ కారణాలతో ఐదారు వేల మగ్గాలు ప్రస్తుతం 14 వందలకు తగ్గిపోయాయి. మంగళగిరిలో ప్రాభవం కోల్పోయిన నాటి చేనేత కళకు పునరుజ్జీవం పోయాలని దాదాపు రెండున్నర దశాబ్దాలుగా నేతన్నలతోపాటు చేనేత కార్మికసంఘాలు, వామపక్ష పార్టీలు పాలకప్రభుత్వాలను వేడుకుంటూనే ఉన్నాయి. అడపాదడపా పోరాటాలు కూడా చేస్తూ వచ్చాయి. కానీ స్పందన మాత్రం శూన్యం. ఏళ్లుగా మెగా చేనేత పార్కు మంగళగిరివాసులను ఊరిస్తూ వస్తోన్నది. అయితే నారా లోకేశ్ తన రాజకీయ జీవితానికి చేనేత కేంద్రమైన మంగళగిరేనే ఎంచుకోవడంతో మంగళగిరి దశ తిరిగింది. ఈ క్రమంలో మంగళగిరిలో మెగా హ్యాండ్లూమ్ పార్కు ఆవిర్భవించబోతుంది. నగరంలోని ఆటోనగర్‌కు వెనుకవైపు శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి చెందిన సర్వే నెంబరు 16లోని 10.80 ఎకరాలను 31 ఏళ్ల లీజుకు తీసుకుని చేనేత పార్కును నెలకొల్పేందుకు చేనేత జౌళి శాఖ సిద్ధమైంది. ఎకరాకు రూ.25 వేల వంతున..ప్రతీ మూడేళ్లకు పది శాతం వంతున లీజు పెంచేలా దేవదాయశాఖతో చేనేత జౌళిశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. చేనేతపార్కు కోసం నిర్దేశించిన ఈ స్థలాన్ని ఆ శాఖ మంత్రి ఎస్ సవిత సంబంధితశాఖ ఉన్నతాధికారులతో కలిసి బుధవారం సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పార్కును తమిళనాడులోని

(మిగతా 8వ పేజీలో)

ఆటోనగర్‌లో ఇప్పటికే వీవర్స్‌శాల

లోకేశ్ ఆటోనగర్ ప్రాంతంలో తన సొంత ఖర్చులతో లోకేశ్ ప్రత్యేకంగా వీవర్స్‌శాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆధునిక డిజైన్లపై నేతన్నలకు శిక్షణను ఇప్పిస్తున్నారు. తయారైన వస్త్రాలకు అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నారు. దీంతో తృప్తి చెందని లోకేశ్ మంగళగిరికి ఒక నాటి ఖ్యాతిని మళ్లీ తెచ్చేందుకు ప్రత్యేకంగా చేనేత పార్కు నిర్మాణానికి పూనుకున్నారు.


రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ భవనం (ఊహాచిత్రం)


వేర్‌హౌస్ (ఊహాచిత్రం)

తండ్రిని కాలువలో పడేసిన కొడుకు
- బొమ్మరాజు పల్లి సమీపంలో మృతదేహం లభ్యం

6

పులిచింతల ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల

మాచర్లలో తొమ్మిదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

ఏఎన్‌యూ డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

పకడ్బందీగా.. ఎలక్షన్ కోడ్

- మండలి ఎన్నికలకు ముందస్తు చర్యలు

3,46,614 మంది ఓటర్లు.. 416 పోలింగ్ స్టేషన్లు

ఎన్నికలపై సమీక్షలో రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కృష్ణ - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాస న మండలికి సంబంధించి ఎలక్షన్ కమిషన్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించినందున ఎన్నికలు ముగిసే వరకు ఎలక్షన్ కోడ్ పకడ్బందీగా అమలు చేయాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి వెబ్ ఎక్స్ ద్వారా బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు ఎస్పీలు, డీఆర్‌వోలు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తెనాలి సబ్‌కలెక్టర్‌తో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై నాగలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ ఈ నెల 29 నుంచే అమల్లోకి వచ్చిందన్నారు. 3న నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. శాసనమండలికి జరిగే ఎన్నికలు సజావుగా చేపట్టేందుకు సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచ తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాల్లో రాజకీయ నాయకుల బ్యానర్లు, పోస్టర్లు, చిత్రపటాలు తొలగించి నివేదిక ఇవ్వాలని తెలిపారు. రాజకీయ పార్టీ నేతల విగ్రహాలకు ముసుగేయాలన్నారు. గ్రాడ్యుయేట్ ఓటరు దరఖాస్తులను ఫిబ్రవరి 10 లోపు పరిశీలించాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. నిబంధనల మేరకు వసతులు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్‌స్టేషన్ల వివరాలు శుక్రవారం సాయంత్రంలోపు అందించాలని తెలిపారు. ఎన్నికలు పేపర్ బ్యాలెట్ ద్వారా జరుగుతున్నందున బ్యాలెట్ బాక్సుల లభ్యత వివరాలు తెలపాలన్నారు. బ్యాలెట్ బాక్సులకు మరమ్మతులు చేపట్టి సిద్ధం చేయాలన్నారు.


అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజకీయ పార్టీలు సహకరించాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహాయ, సహకారాలు అందించాలని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కృష్ణ - గుంటూరు జిల్లాలకు సంబంధించి ఈ నెల 29కి 2,06,225 మంది పురుషులు, 1,40,344 మంది మహిళలు, 45 మంది ట్రాన్స్‌జెండర్స్ కలిపి మొత్తం 3,46,614 మంది ఓటర్లు నమోదయ్యారన్నారు. 416 పోలింగ్ స్టేషన్లు గుర్తించామన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. పబ్లిక్ స్థలాల్లో సమావేశాలు, ర్యాలీలకి ఆర్‌వో వద్ద అనుమతి తీసుకోవాలన్నారు. ఈ సమావేశాల్లో రిటర్నింగ్ అధికారులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేశు, జేసీ భార్గవతేజ, డీఆర్‌వో షేక్ ఖాజావలి, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డీసీవో వీరాచారి, డీపీవో నాగసాయి, మైన్స్ డీడీ శ్రీవెంకటసాయి, ఉద్యాన డీడీ రవీంద్ర, డ్వామా పీడీ శంకర్, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ లక్ష్మి, పశు సంవర్ధక శాఖ జేడీ నరసింహారావు, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్యతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులు చిరతనగండ్ల వాసు, చరక కుమారగౌడ్, వై కృష్ణకాంత్, కంచర్ల శివరామయ్య, గాదె వెంకటేశ్వరరావు, అత్తోట జోసఫ్, బిల్లా సునీల్, సేవాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు ఏర్పాట్లు

జిల్లావ్యాప్తంగా 75 కేంద్రాల్లో పరీక్షలు

5 నుంచి ఒకేషనల్.. 10 నుంచి జనరల్ విద్యార్థులకు

నరసరావుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిబ్రవరి 5 నుంచి ఒకేషనల్, పదో తేదీ నుంచి జనరల్ విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. ఇంటర్ జనరల్ ప్రాక్టికల్స్‌కు 62 కేంద్రాలు, ఒకేషనల్ విద్యార్థుల ప్రాక్టికల్స్‌కు 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులు 13,749 మంది, ఒకేషనల్ 780 మంది పరీక్షలు రాయనున్నారు. జిల్లాలోని అన్ని కేంద్రాల్లో వసతులు పరిశీలించామని డీఐఈవో నీలావతి తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు


ల్యాబ్

సీసీ కెమేరాల నిఘాలో పరీక్షలు

మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమేరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా కంట్రోల్ రూం నుంచి కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను తరలించేందుకు పోలీసు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతీ కేంద్రంలో బల్లలు, ఫ్యాన్లు, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నారు. పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 48 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇంటర్ జనరల్ మొదటి సంవత్సరం పరీక్షలకు 16,811, సెకండ్ ఇయర్ పరీక్షలు 13,749 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వృత్తి విద్యా కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం పరీక్షలకు 1,094, సెకండ్ ఇయర్ పరీక్షలకు 780 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో ఎంపీసీ విద్యార్థులు 9,583 మంది, బైసీపీ విద్యార్థులు 1926 మంది ఉన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలకు బాలికలు 9,219, బాలురు 8,686 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు బాలికలు 7,608, బాలురు 6,921 మంది హాజరుకానున్నారు.

ముఖ్యమంత్రి హామీలు.. అమలు

ఇంటి నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్

కల్యాణ మండప వ్యయ అంచనాల్లో అధికారులు

నరసరావుపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నరసరావుపేట మండలం యలమందలో గత నెల 31న పర్యటించిన సమయంలో గ్రామస్తులకు ఇచ్చిన హామీల అమలకు కలెక్టర్ అరుణ్‌బాబు శ్రీకారం చుట్టారు. ఇంటికి వచ్చి పింఛన్ అందజేసిన సందర్భంలో ఇంటి నిర్మాణానికి నిధులు ఇవ్వాలని చంద్రబాబును పుల్లంగుల ఏడుకొండలు కోరారు. అప్పుడు సీఎం ఇచ్చిన హామీ మేరకు ఏడుకొండలకు ఇంటిని మంజూరు చేశారు. ఈ క్రమంలో పాత ఇంటిని కూల్చి కొత్తగా ఇంటి నిర్మాణాన్ని చేపట్టగా పనులను కలెక్టర్ గురు వారం పరిశీలించారు. ఇంటి నిర్మాణాన్ని త్వరతగతిన పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ఏడుకొండలు గాలియంత్రం కావాలని ముఖ్య మంత్రిని కోరగా దానిని అప్పట్లో 24 గంటల్లోనే అందజేసిన విషయం తెలిసిందే. గ్రామంలో కల్యాణ మండపం నిర్మించాలని డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు చంద్రబాబును కోరగా వ్యయ అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ సంబంధిత అధికారులతో కల్యాణ మండప నిర్మాణం పై చర్చించారు. పంచాయతీరాజ్‌శాఖ అధికారులు అంచనాలు రూపొందిస్తున్నారు.

యలమంద, చినతురకపాలెంలో పర్యటన..

యలమంద, చినతురకపాలెంలో కలెక్టర్ పర్యటించారు. గొనె సంచులతో పరదాల తయారీని పరిశీలించారు. గ్రూపులుగా ఏర్పడితే పరదాల తయారీకి యంత్రాల కొనుగోలుకు రూ.10 లక్షల వరకు ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చినతురకపాలెంలోని ఉర్దూ పాఠశాలలో 9, 10 తరగతులు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను గ్రామస్తులు కోరారు. అదనపు తరగతుల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో మాధవీలత, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి బాలూనాయక్, ఎల్‌డీఎం రాంప్రసాద్, నైపుణ్యాభివృద్ధి శాఖాధికారి తమ్మాజీరావు, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు, తహసీల్దారు వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.


ఇంటి నిర్మాణంపై ఏడు కొండలు కుటుంబంతో చర్చిస్తున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు

హేతుబద్ధీకరణపై కమిటీ వేయండి

- సీఎంకు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు రజాక్ విజ్ఞప్తి



సీఎం చంద్రబాబు నాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న షేక్ అబ్దుల్ రజాక్

గుంటూరు సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హేతుబద్ధీకరణ అంశంపై సీనియర్ ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ నియమించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ సీఎం చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సచివాలయంలో ఐక్యవేదిక చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న సచివాలయ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలతో సమావేశం నిర్వహించి హేతుబద్ధీకరణపై సరైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, ప్రొబేషన్ డిక్లరేషన్ ఆలస్యం చేసినందున రావాల్సిన బకాయిలు, ప్రొబేషన్ డిక్లరేషన్ అయిన నాటి నుంచి జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్, పే-రివిజన్ కమిషన్ ఏర్పాటు చేయాలని, మెరుగైన ఐఆర్ ప్రకటించాలని, ఓల్డ్ పెన్షన్స్ స్కీమ్ అమలు చేయాలని, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కచ్చితంగా కృషి చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రమేష్ కుమార్, నాగ సాయి, బాజీ పఠాన్, వెంకటేశ్వర్ రెడ్డి, రమేష్, సుగుణ, రవీంద్ర రాజు, కేదేశ్వరరావు, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గత నవంబరులో నిర్వహించిన డిగ్రీ కోర్సుల 3వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు విడుదల చేశారు. ఈ పరీక్షలకు 9329 మంది హాజరవ్వగా 5198 మంది ఉత్తీర్ణులు అయ్యారని ఆయన తెలిపారు. పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు మాట్లాడుతూ ఫలితాలపై విద్యార్థులకు సందేహాలు ఉంటే రీవాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక్కో జవాబు పత్రానికి రూ. 1490 ఫిబ్రవరి 13వ తేదీలోగా చెల్లించి కళాశాల ద్వారా డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ కార్యాలయానికి పంపాలని సూచించారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎన్.వి. కృష్ణారావు, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌వీఎస్‌ఎస్‌ఎన్ రవికుమార్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్, ఆచార్య కె. ధనలక్ష్మి, పరీక్షల నోడల్ ఆఫీసర్ రెడ్డి ప్రకాశరావు, సీటీఏ, ఏసీటీఏ పరీక్షల అధికారులు పాల్గొన్నారు.

సమ సమాజ నిర్మాతలుగా పూలే దంపతులు

- మహిళా విద్య, ఉపాధితోనే దేశాభివృద్ధి సాధ్యం
- జాతీయ సదస్సులో వీసీ ఆచార్య కె.గంగాధరరావు



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనలో మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేల కృషి అనిర్వచనీయమని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. విశ్వవిద్యాలయంలోని పూలే అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే కాంట్రిబ్యూషన్ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్ ఇన్ ఇండియా అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.సురేష్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ గంగాధరరావు మాట్లాడుతూ సమాజంలో స్త్రీలు విద్యావంతులు అయినట్లయితే దేశాభివృద్ధితోపాటు ప్రపంచ వృద్ధి కూడా సాధ్యమవుతుందన్నారు. 19వ శతాబ్దంలో పూలే దంపతులు సంస్కరణలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. కనీస అవసరాలు లేని ఆ రోజుల్లోనే విద్యకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించిన వీరు అవిరళ కృషిని చేశారని కొనియాడారు. పూలే సంస్కరణలు, సావిత్రిబాయి పూలే ఆచరణలు నేటి సమాజానికి దిక్సూచిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య టి. రమేష్ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాల్లో మహిళలు రాణిస్తున్నారంటే దానికి సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే ఆనాడు తీసుకొచ్చిన సంస్కరణలు కీలకంగా ఉన్నాయన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ మహిళ సాధికారత సాధించినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని గుర్తు చేశారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే వంటి మహనీయులను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలి అన్నారు. సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎం. త్రిమూర్తిరావు మాట్లాడుతూ రెండు రోజుల ఈ జాతీయ సదస్సుకు అనూహ్య రీతిలో పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఒరిస్సా, తమిళనాడు రాష్ట్రాల నుంచి పరిశోధకులు హాజరైనట్లు పేర్కొన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ సోషియాలజీ ప్రొఫెసర్ ఆచార్య డి.రామారావు, సదస్సు కోశాధికారి ఆచార్య కె.ధనలక్ష్మి, దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. వెంకటేశ్వర్లు, అంబేద్కర్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య అశోక్ కుమార్, ఆచార్య తులసీదాస్, విభాగం ప్రోగ్రామర్ బి.కోటి యాదవ్, అధ్యాపకులు, పరిశోధకులు విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనలో సరికొత్త రికార్డులు

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనలో కూటమి ప్రభుత్వం సరికొత్త రికార్డులు నెలకొల్పుతుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాట శ్రీధర్ అన్నారు. గురువారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ప్రాంతానికి కొత్త పరిశ్రమ వచ్చేలా, ప్రతి ప్రాంతం ఒక్కో రంగంలో గుర్తింపు పొందేలా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ లక్షల కోట్లు పెట్టుబడులు ఆకర్షిస్తున్న ఫలితాలు త్వరలోనే అంతా చూస్తారని అన్నారు. చంద్రబాబు నాయుడు దీర్ఘకాలిక లక్ష్యాలలో ప్రస్తుతం చూస్తున్న ఫలితాలు ప్రారంభం మాత్రమేనని, కేవలం ప్రభుత్వం వచ్చిన ఏడు నెలలో రూ.6,33,568 కోట్లు పెట్టుబడులతో 4 లక్షల పైచిలుకు ఉద్యోగాలు ఇచ్చే సాహసం ఎక్కడైనా జరిగిందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఉత్తరాంధ్ర, అమరావతి, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా చేసుకొని, అందుకోసం రాష్ట్రానికి 20 భారీ పరిశ్రమలను సాధించుకు వచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌కే చెల్లుతుందన్నారు. మాజీ సీఎం జగన్‌రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్ళలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాకపోవటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చినా జగన్ రెడ్డి అండ్ గ్యాంగ్‌కు ఎప్పుడూ ఏడుపే అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్‌బాబు, జిల్లా టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి జాస్తి చంద్రశేఖర్, దండా అనీల్ పాల్గొన్నారు.

తండ్రిని కాలువలో పడేసిన కొడుకు

- బొమ్మరాజుపల్లి సమీపంలో మృతదేహం లభ్యం



కొండయ్య మృతదేహం

ఈపూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తండ్రిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కొడుకే కాలయముడై కాలువ నీటిలో పడేసి హత్య చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రమైన నూజండ్ల గ్రామానికి చెందిన గంగినేని కొండయ్య(85)ను పెద్ద కొడుకు వెంకటేశ్వర్లు కారులో తీసుకువచ్చి భద్రుపాలెం వద్ద నాగార్జున సాగరు కుడిప్రధాన కాలువ నీటిలో పడేశాడు. అక్కడకు కొద్ది దూరంలో ఉన్న గ్రామస్తులు చూసి వెంకటేశ్వర్లును పట్టుకొని దేహశుద్ధి చేయగా, ఇంట్లో గొడవలు కారణంగా నా తండ్రి, నేను కాలువలో దూకి చనిపోయేందుకు వచ్చామని వెంకటేశ్వర్లు వారికి చెప్పాడు. గ్రామస్తులు వెంకటేశ్వర్లును పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. కాలువ నీటిలో వృద్ధుడు కొద్దిసేపు ఈతకొట్టి నీటిలో మునిగినట్లు చెప్పారు. వృద్ధుడిని రక్షించేందుకు గ్రామస్తులు ప్రయత్నించగా డీప్‌కట్ కావడంతో లోతు ఎక్కువగా ఉండి మునిగిపోయాడు. గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టగా బొమ్మరాజుపల్లి సమీపంలో మృతదేహం కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొండయ్య, శిరోమణి దంపతులకు ఇద్దరు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు. కొండయ్య, భార్య శిరోమణి పంపకాలలో తమకు వచ్చిన ఆస్థిని విక్రయించగా వచ్చిన సుమారు రూ.20 లక్షలు తీసుకు వెళ్లి మూడు సంవత్సరాల కితం పెద్ద కొడుకు వెంకటేశ్వర్లుకు ఇచ్చి అతని వద్దే ఉంటున్నారు. ఏడాదిన్నర క్రితం తల్లి శిరోమణి చనిపోయింది. కొండయ్య వృద్ధాప్యంతో ఇబ్బందులు పడుతున్నాడు. వృద్ధుడైన తండ్రి వలన తరచూ ఇంట్లో గొడవలు వస్తున్నాయి. ఈక్రమంలో గురువారం వెంకటేశ్వర్లు ఇంట్లో భార్య అనూరాధతో గొడవపడ్డాడు. ఆ సమయంలో భార్య స్పృహతప్పి పడిపోయింది. వెంకటేశ్వర్లు ఆవేశంతో వేరే వాళ్ల కారు అద్దెకు తీసుకొని వచ్చి అందులో తండ్రి కొండయ్యను తీసుకుని వెళ్లి కాలువలో పడేశాడు. గురువారం రాత్రి సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వినుకొండ రూరల్ సీఐ ఆర్ ప్రభాకర్ గ్రామస్తులను సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వర్లు తమ అదుపులో లేడని ఎస్‌ఐ ఎం.ఉమామహేశ్వరరావు చెప్పారు.

దాడి చేసిన భర్త బంధువులపై కేసు

కొల్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భర్త అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు వచ్చిన భార్య, అత్తమామలపై మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు విచక్షణా రహితంగా దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల గ్రామం క్రాపకు చెందిన పట్టాభి అరుణ్ కుమార్ (28) చేబ్రోలు మండలానికి చెందిన కఠారి వైశాలి అనే మైనర్‌ను గతేడాది అక్టోబరు 10న వివాహం చేసుకున్నాడు. ఎటువంటి పనులు చేయకుండా ఖాళీగా తిరుగుతూ మద్యం తాగి భార్యను వేధిస్తున్నాడు. గతేడాది నవంబరు 10న మృతుడు అరుణ్ కుమార్ సోదరి భర్త పులివర్తి రవి మృతుని భార్యను పుట్టింటికి పంపించి వచ్చాడు. ఈ క్రమంలో పుట్టింట్లో భార్య వద్దకు తరచూ వచ్చి వెళుతున్న అల్లుడిని అత్తమామలు తమ కుమార్తెను కాపురానికి తీసుకు వెళ్లాలని కోరారు. ఈ నెల 23న తమ బంధువు చిలకా కిరణ్, ఇతర పెద్ద మనుషుల సమక్షంలో తెనాలిలో భార్యను కాపురానికి తీసుకు వెళ్లే విషయమై మృతునితో చర్చించి మందలించారు. దీంతో పెద్ద మనుషులను తీసుకువచ్చి తన భార్యను కాపురానికి తీసుకు వెళ్తానని చెప్పాడు. అదే రోజు అర్ధరాత్రి తెనాలిలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన మృతుని స్నేహితుడు, మృతుడు భార్య పురుగు మందు తాగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి వైద్యశాలకు తరలించారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న అరుణ్‌కుమార్ పరిస్థితి విషమించడంతో గుంటూరు సమగ్ర వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 28న మృతి చెందాడు. మృతుని ఖననం కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన భార్య, ఆమె తల్లి ధనలక్ష్మిపై మృతుని బంధువులు ఇంట్లోకి తీసుకువెళ్లి దాడి చేశారు. పోలీస్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మృతుడి బావ పుల్లారావు, తల్లి రాజకుమారి, మృతుడు సోదరి శారద, ఆమె భర్త రవిలు మృతుని భార్య వైశాలిని గర్భవతి అని చూడకుండా కడుపుపై తన్నారు. ఇదే సమయంలో బయట ఉన్న ఆమె తండ్రి భూషణంపై కూడా పది మంది ముకుమ్మడి దాడికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు అడ్డుపడి సర్ది చెప్పి ఆటోలో పంపించగా వేమూరు మండలం జంపని వద్దకు చేరుకుని అక్కడ నుంచి 108 అంబులెన్స్‌లో తెనాలి వైద్యశాలకు వెళ్లారు. భర్తను కోల్పోయి భర్త కుటుంబ సభ్యుల దాడికి గురైన బాధితురాలు చికిత్స పొందుతూ వైద్యశాలలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎఎస్‌ఐ అర్జున్ గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థులు

- ఫోన్ నంబరు ఆధారంగా గుర్తించిన పోలీసులు

దాచేపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయిన విద్యార్థులను 24 గంటలలోపే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కనుగొని తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన గురువారం దాచేపల్లిలో చోటు చేసుకుంది. దాచేపల్లి ఎస్‌ఐ సౌందర్ రాజన్, ఎస్‌ఐ పాపారావు తెలిపిన వివరాల మేరకు.. దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన ఇర్ల శ్రీనివాసరావు, మీసాల డేవిడ్‌రాజు, చర్లపల్లి నగేష్ కృష్ణ 8వ తరగతి చదువుతున్నారు. వీరు బుధవారం మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా నడికుడి రైల్వే స్టేషన్ నుంచి రైలు ఎక్కి తెలంగాణ రాష్ట్రంలోని జడ్చర్లకు చేరుకున్నారు. వారి ముగ్గురిలో ఒకరి వద్ద సెల్ ఫోన్ ఉంది. సెల్ ఫోన్ నంబరు ఆధారంగా వారి అడ్రస్‌ను కనుగొన్నారు. తెలంగాణ పోలీసుల సహకారంతో వారిని పోలీసుల అదుపులో ఉంచారు. కుటుంబ సభ్యులు, పోలీసులు కలిసి ప్రైవేట్ వాహనంలో జడ్చర్లకు చేరుకొని పిల్లలను తీసుకొని దాచేపల్లి పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటి వరకు తీవ్ర ఆందోళనతో ఉన్న తల్లిదండ్రులు పిల్లలను చూసి పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. పోలీసులు స్పందించిన తీరు, చేసిన సేవలు స్థానిక ప్రజలు ప్రశంసలు అందజేశారు.



విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న దాచేపల్లి పోలీసులు

కృత్రిమ మేధతో ఔషధాల విశ్లేషణ



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మొంటు కుమార్ ఎం పటేల్

గుంటూరు (విద్య) జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (కృత్రిమ మేధా) ద్వారా ఔషధాల డేటాను విశ్లేషించవచ్చునని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ మోంటు కుమార్ ఎం పటేల్ అన్నారు. గురువారం చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ (చిప్స్)లో జరిగిన ఫార్మా నెక్స్ జాతీయ స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర అధ్యక్షత వహించారు. డాక్టర్ మోంటు కుమార్ ఎం పటేల్ మాట్లాడుతూ ఔషధాల పరస్పర చర్యలను కృత్రిమ మేధ ద్వారా విశ్లేషించడానికి అవకాశం ఉందన్నారు. ఫార్మసీ రంగంలో కృత్రిమ మేధా కీలక భూమిక పోషించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఔషధాలు తయారీ, పరిశోధన వంటి రంగాల్లో దీని పాత్ర వేగవంతం కానున్నట్లు తెలిపారు. ఫార్మసీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ ప్రసంగిస్తూ ఫార్మసీ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు డాక్టర్ నిరంజన్ బాబు, డాక్టర్ ఎస్ఎల్ఎన్ ప్రసాద్ రెడ్డి, డాక్టర్ ఎం.రాధాకృష్ణమూర్తి, ఏపీ ఫార్మసీ కౌన్సిలర్ రిజిస్టర్ డాక్టర్ విలియం క్యారీ, చిప్స్ కళాశాల కార్యదర్శి డాక్టర్ సీఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ సిలబస్ డిజిటలైజేషన్

గుంటూరు (విద్య) జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రోజు రోజుకు పెరుగుతున్న పరిశ్రమ అవసరాలు, టెక్నాలజీలకు అనుగుణంగా ఫార్మసీ సిలబస్‌ను డిజిటలైజ్ చేయనున్నట్లు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) ప్రెసిడెంట్ డాక్టర్ మోంటుకుమార్ ఎం.పటేల్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో "ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ పర్సనలైజ్డ్ డ్రగ్ డిస్కవరీస్ ఏ ఫ్యూచరిస్టిక్ అప్రోచ్" అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌ను గురువారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మోంటు కుమార్ ఎం.పటేల్ మాట్లాడుతూ పీసీఐ ద్వారా విద్యార్థులకు, అధ్యాపకులకు సరికొత్త టెక్నాలజీలపైన ట్రైనింగ్ ఇవ్వడంతో పాటు స్కిల్స్ పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి నెలా 150 మంది విద్యార్థులకు ట్రైనింగ్ అందించడానికి వీలుగా ట్రైనింగ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన న్యూఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎం.వెంకట రమణ, కౌన్సిల్ మెంబర్, న్యూఢిల్లీలోని పీసీఐ సెంట్రల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఎస్.ఎల్.ఎన్ ప్రసాద్ రెడ్డి, ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విల్లియం కారే, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస బాబు పాల్గొన్నారు.

జువాలజీ విభాగంలో ముగిసిన జాతీయ సదస్సు

పెదకాకాని, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జువాలజీ అండ్ ఆక్వాకల్చర్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ టాక్సికాలజీ, ఇమ్యూనాలజీ అండ్ బయోడైవర్సిటీ అనే జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో పరిశోధన పత్రాలు సమర్పించిన వారికి, పోస్టర్ ప్రజెంటేషన్ చేసిన వారికి ధ్రువ పత్రాలను అందజేశారు. సదస్సు ముగింపు సందర్భంగా డైరెక్టర్ ఆచార్య వి.వెంకటరత్నమ్మ మాట్లాడుతూ ఈ సదస్సులో వాతావరణ కాలుష్యం, కలుషిత వ్యర్థాల పరిణామాలు, వాటి నివారణ చర్యలు చర్చించినట్లు తెలిపారు. అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలు, పరిశోధకులు తమ విలువైన సలహాలను అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ మాజీ రెక్టార్ ఆచార్య ఎం.భాస్కర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.వీరయ్య, సదస్సు కో డైరెక్టర్ ఆచార్య పి.పద్మావతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య ఎం.జగదీష్ నాయక్, ఆచార్య కె.సుమంత్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ గోపాలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులిచింతల ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల



చేప పిల్లలను విడుదల చేస్తున్న జిల్లా మత్స్య శాఖ అధికారి సంజీవరావు

అచ్చంపేట, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిచింతల ప్రాజెక్టు వద్ద గురువారం జిల్లా మత్స్య శాఖ అధికారులు ఎనిమిది లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్య శాఖ అధికారి సంజీవరావు మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాల్లో జీవనోపాధి మెరుగు పడుతుందన్నారు. చేప పిల్లల విడుదలతో ఆ నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యువజన పథకం ద్వారా 52 లక్షల చేప పిల్లలకు గానూ మొదటి విడతగా పులిచింతల జలాశయంలో ఎనిమిది లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, డీఈఈ టి.అరుణ కుమారి, కిషోర్, లలిత, శోభ, నాగార్జున సాగర్ మత్స్య శాఖ అభివృద్ధి అధికారి పీవీఏ శ్రీనివాసరావు, మత్స్య శాఖ సహాయ పర్యవేక్షకులు కె.భాగ్యలత, అచ్చంపేట తహసీల్దార్ జి.శ్రీనివాసరావు, ఎంపీడీవో కె. శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి పి.వెంకటేశ్వర్లు, మత్స్య సహకార సంఘ అధ్యక్షుడు ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ గదిలో విద్యార్థి ఆత్మహత్య



రాజశేఖర్ (ఫైల్)

మాచర్లటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ గదిలో విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మాచర్ల పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. వెల్దుర్తి మండలం లోయపల్లికి చెందిన పందిరి రాజశేఖర్ (15) పట్టణంలోని రాయవరంలోని ఓ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. స్కూల్‌లోని హాస్టల్‌లోనే ఉంటూ విద్యను కొనసాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒంటరిగా హాస్టల్ గదికి వచ్చి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్‌కు వచ్చిన విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూసే సరికి అప్పటికే రాజశేఖర్ మృతి చెంది ఉన్నాడు. స్కూల్ యాజమాన్యం రాజశేఖర్ మృతదేహాన్ని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మాచర్ల రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

వేటపాలెం ఎడ్ల జతకు ప్రథమ బహుమతి

రెంటచింతల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని కానుకమాత 175వ తిరునాళ్లను పురస్కరించుకుని గురువారం నిర్వహించిన 6 పళ్ల ఒంగోలు జాతి పశుప్రదర్శన రక్తి కట్టించింది. అత్తోట శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరికి(వేటపాలెం,బాపట్ల జిల్లా) చెందిన ఎడ్ల జత 4500 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి, మోదుగు రామిరెడ్డి(పెదపరిమి), రామినేని రత్తయ్య చౌదరి (చేబ్రోలు) కంబైన్డ్ జత 4049.6 ద్వితీయ బహుమతి, కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి, ఏటుకూరి శ్రీనివాసరావు (పల్నాడు) 3600 అడుగుల దూరం లాగి మూడో బహుమతి, అనంతనేని శ్రీకావ్య, శ్రీమధు (పెనమలూరు, కృష్ణా జిల్లా)3487.3 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతి, మేకా అంజిరెడ్డి (చల్లగుండ్ల, నకరికల్లు) 3347.1 దూరం లాగి ఐదో బహుమతిని గెలుచుకున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం గురువారం నాటికి 552.70 అడుగులు ఉంది. ఇది 215.76 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7436 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 24,685 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 44,168 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

1,09,020 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,02,729 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,09,020 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 68,402 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7000	13600	334	7500	13000
నెంబరు. 5	8000	14000	నెంబరు.5	--	--
273	10000	10000	273	9200	9200
341	8000	15000	341	8500	11000
4884	10500	10500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7000	15000	తేజ	9000	13500
బ్యాడిగి	7500	13500	బ్యాడిగి	8000	11500
దేవనూరు డీలక్స్	8500	13500	దేవనూరు డీలక్స్	12000	12000
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4000	8500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

సగం సగం పనులు రద్దు

● రూ.150 కోట్లతో రివైజ్డ్ అంచనాలు

ఎఫెక్ట్

పిడుగురాళ్ల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పట్టణ వాసులకు తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు రూ.138కోట్ల ఏఐబీ నిధులు మంజూరయ్యాయి. రెండేళ్లుగా పిడుగురాళ్లలో ఆర్అండ్‌బీ బంగ్లా, మార్కెట్‌యార్డులో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణ పనులు పునాదులకే పరిమితమై బిల్లులు రాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ ఎక్కడికక్కడ పనులు నిలిపివేశాడు. గత వారం "ఏళ్లుగా పునాదుల్లోనే...!" అనే శీర్షికన ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో సగం సగం పనులు పూర్తిచేసివున్న వాటికి టెండర్లను రెండు రోజుల క్రితం రద్దు చేశారు. మరలా రూ.150కోట్ల రివైజ్డ్ అంచనాలతో డీపీఆర్‌ను తయారుచేసేందుకు పబ్లిక్ హెల్త్ అధికారులు సన్నద్ధమయ్యారు. పనిచేయని తాగునీటి పథకానికి నెలకు రూ.30లక్షల విద్యుత్ బిల్లులు మున్సిపాల్టీకి పెనుభారంగా మారింది. మున్సిపాల్టీకి వచ్చే ఆదాయం అంతా విద్యుత్‌బిల్లులకే సరిపోయే పరిస్థితి వుండటంతో అభివృద్ధి పనులకు నిధుల ఆటంకం ఏర్పడుతోంది. 15వ ఆర్థిక సంఘం నిధులన్నీ మున్సిపాల్టీ విద్యుత్ బకాయిలకే సరిపోతుండటంతో అధికారులు తదుపరి అభివృద్ధికి నిధుల సేకరణపై తలమునకలవుతున్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలి

● జేసీ సూరజ్ ధనుంజయ్ ఘనోరే



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఘనోరే

సత్తెనపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని రెవెన్యూ సమస్యలను, రీసర్వే సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఘనోరే అన్నారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల అధికారులతో గురువారం రెవెన్యూ సమస్యలు, భూసర్వేపై ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు, బెల్లంకొండ, క్రోసూరు, అచ్చంపేట, అమరావతి, పెదకూరపాడు మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అన్నదాతలకు బసవన్నలు ఆత్మబంధువులు

● ఎమ్మెల్యేలు యరపతినేని, బ్రహ్మానందరెడ్డి



ఎడ్ల బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు జూలకంటి, యరపతినేని తదితరులు

రెంటచింతల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నిత్యం వ్యవసాయంలో అన్నదాతలకు చేదోడువాదోడుగా ఉంటున్న బసవన్నలు ఆత్మబంధువులేనని మాచర్ల, గురజాల ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, యరపతినేని శ్రీనివాసరావులు అన్నారు. 175 కానుకమాత తిరునాళ్ల సందర్భంగా సెయింట్ జోసఫ్ ఉన్నతపాఠశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఒంగోలు గిత్తల బండలాగుడు పోటీలను గురువారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పల్నాడు అభివృద్ధికి తామిద్దరం శక్తి వంచన లేకుండా కృషిచేస్తామన్నారు. యరపతినేని గురజాలకు ఎమ్మెల్యేతో పాటు మంచికల్లు స్వగ్రామానికి కూడా ఎమ్మెల్యేనని అందుకని ఇక్కడ ఇద్దరు ఎమ్మెల్యేలం పనిచేస్తున్నామని జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకురి కాంతారావు, సుమంత్‌రెడ్డి, అల్లం ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సాయం అందిస్తాం: యరపతినేని

తాను విద్యనభ్యసించిన సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే యరపతినేని అన్నారు. కరస్పాండెంట్ పీటర్ పాపయ్య, టీచర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఫిబ్రవరి 7న జరిగే వజ్రోత్సవాలకు తప్పకహాజరవుతానన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు



సెయింట్ ఆన్స్‌లో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మాచర్ల రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టణ, మండలంలో కేటాయించిన పోలింగ్‌బూత్‌లను గురువారం అధికారులు పరిశీలించారు. మాచర్లలోని సెయింట్ ఆన్స్ బాలికోన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లు 316, 317, 318, 319తో పాటు మండలంలోని విజయపురిసౌత్‌లో 320 బూత్‌ను పరిశీలించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో ఫణికుమార్ నాయక్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, ఎస్‌ఐ సంధ్యారాణి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ, సర్వేయర్ రఘుపతి ఉన్నారు.

అమరావతిలో...

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలకు అమరావతిలోని శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో సిద్ధంచేయాల్సిన పోలింగ్‌బూత్‌లను తహసీల్దార్ డానియేలు గురువారం పరిశీలించారు. గతంలో రెండు బూత్‌లు ఉండగా అదనంగా మరో బూత్‌ను ఏర్పాటుచేయాలని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పరిశీలించారు. సర్వేయర్ భాగ్యలక్ష్మీ, వీఆర్‌ఓ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

రూ 5.70లక్షలు పలికిన బలిజేపల్లి చేపల చెరువు

రాజుపాలెం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజేపల్లి గ్రామంలో ఉన్న చేపలచెరువుకు గురువారం వేలం నిర్వహించారు. బహిరంగ వేలంలో గ్రామానికి చెందిన పల్లపాటి పెద్దిరాజు రూ.5.70లక్షలకు కైవసం చేసుకున్నాడు.

ఫ్లెక్సీల తొలగింపు

మాచర్లటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల్లో జరగనున్న పట్టభద్రుల ఎన్నికల కోడ్ దృష్ట్యా అన్ని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ధూళిపాళ్ల వేణుబాబు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో బ్యానర్లు, ఫ్లెక్సీల తొలగింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు.

● వెల్దుర్తి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కోడ్ అమలులో ఉన్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా తొలగించాలన్నారు.

కేసానుపల్లిలో మాలాధారణ స్వాముల గ్రామోత్సవం

దాచేపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసానుపల్లి గ్రామంలో లక్ష్మీతిరుతపమ్మ మాలాధారణ స్వాములు గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం గ్రామంలో జరిగిన కార్యక్రమానికి మండలంలోని మాలాధారణ స్వాములంతా అధికసంఖ్యలో హాజరయ్యారు. తొలుత కేసానుపల్లిలోని గంగాభవానీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన జ్యోతి ప్రదర్శన గ్రామవీధుల్లో మేళతాళాలతో, గోవిందనామ స్మరణతో సాగింది.

ఆగివున్న ట్రాక్టర్‌ను ఢీకొని ద్విచక్ర వాహనచోదకుడికి గాయాలు

నారాయణపురంలోని ప్రియదర్శిని లాడ్జి వద్ద రాష్ట్రరహదారిపై రేకుల లోడుతో రోడ్డు పక్కగా నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్ర వాహనచోదకుడు మస్తాన్‌వలి గురువారం ఢీకొట్టాడు. తీవ్ర గాయాలపాలైన క్షతగాత్రుడికి స్థానిక ప్రైవేట్ వైద్యశాలలో ప్రాథమికచికిత్స నిర్వహించి మెరుగైన వైద్యంకోసం గుంటూరు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పశు వైద్య శిబిరాలను రైతులు ఉపయోగించుకోవాలి

● పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ రామారావు

నకరికల్లు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను తమ పశువులకు పరీక్షలు చేయించుకొని వైద్య సేవలను వినియోగించుకోవాలని పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ రామారావు కోరారు. గురువారం నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామీణ పశు వైద్యశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. పశువులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో దేచవరం వీఏఎస్ డాక్టర్ నంబుల సుజాత, కుంకుల గుంట జేవీవో పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకూడదు

● అధికారులకు ఎమ్మెల్యే యరపతినేని ఆదేశం



ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గురజాలటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రిని పురస్కరించుకుని వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మండలంలోని దైదలో ఉన్న అమరలింగేశ్వరస్వామిని గురువారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. అమరలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహాశివరాత్రి పర్వదినం నేపథ్యంలో ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు రప్పించి ఆలయం అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. కూటమి నేతలు షిఫ్టుల వారీగా సహాయ కార్యక్రమాల్లో పాల్గొంటారని, మహిళా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం ఆలయ పరిసరాలను, టాయిలెట్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సాగర్ కుడి కాలువ చైర్మన్ వీ కాంతారావు, ఆలయ చైర్మన్ వీ సాంబశివరావు, టీడీపీ మండల అధ్యక్షుడు జే లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు ఏ శ్రీనివాసరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కే అంకారావు, కౌన్సిలర్ ఎన్ బొల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య ఎన్జీ రంగా వర్సిటీని సందర్శించిన ఎమ్మెల్యే

గురజాల నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురం ఆచార్య ఎన్జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీని గురువారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సందర్శించారు. కంది పంటను పరిశీలించి దిగుబడి, పెట్టుబడులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూనివర్సిటీలో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు.

బెల్లంకొండని అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే ప్రవీణ్



ఎమ్మెల్యే ప్రవీణ్‌తో చర్చిస్తున్న టీడీపీ నాయకులు

బెల్లంకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. రాష్ట్ర టీడీపీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం గురువారం గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిశారు. ఈ సందర్భంగా మస్తాన్ షరీఫ్ బెల్లంకొండ మెయిన్‌రోడ్డు నుంచి నాగిరెడ్డిపాలెం వెళ్ళే డొంకకు నిధులు కేటాయించి సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. బెల్లంకొండ యాదవ బజారు నుంచి పొలాలకు వెళ్లే ఎర్రడొంకకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రహదారులను అభివృద్ధి చేస్తానని తెలిపారు.

రహదారి నిర్మాణం కోసం ఎమ్మెల్యేకు వినతి

మండలంలోని కేతవరం లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్దకు రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని బెల్లంకొండ దేవదాయశాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి గురువారం ఎమ్మెల్యే ప్రవీణ్‌ను కోరారు. యమ్మాజీగూడెం నుంచి అటవీభూముల మీదుగా స్వామివారి ఆలయం వద్దకు పది కిలోమీటర్లు ఉందని, ఫారెస్టు అధికారులతో చర్చించి రహదారి ఏర్పాటుకు అనుమతులు ఇప్పించాలని ఎమ్మెల్యేని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఫారెస్టు అధికారులతో చర్చించి రహదారికి అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆలయ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయండి



ఎమ్మెల్యే ప్రవీణ్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ మురళీకృష్ణ ప్రసాద్, ఈఓ సునీల్‌కుమార్

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కృష్ణా పుష్కరాలకు సంబంధించి ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అమరేశ్వరాలయ చైర్మన్ వాసిరెడ్డి మురళీకృష్ణప్రసాద్, సహాయ కమిషనర్, ఈఓ పీ సునీల్‌కుమార్‌ను ఆదేశించారు. ఎనికపాడులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తనను మర్యాదపూర్వకంగా కలిసిన మురళీకృష్ణప్రసాద్, సునీల్‌కుమార్‌తో ప్రవీణ్ మాట్లాడారు. 2028లో జరగనున్న కృష్ణాపుష్కరాల గురించి, ఆలయ అభివృద్ధిపై చర్చించారు. 26న జరిగే మహాశివరాత్రి ఏర్పాట్లకు సంబంధించి అధికారులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

అభివృద్ధిపనులను పూర్తిచేస్తాం..

ఎఫెక్ట్

కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.60కోట్లతో చారిత్రక అమరావతిలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తిచేసి పర్యాటకులను ఆకర్షించేలా అమరావతిని తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ప్రవీణ్ తెలిపారు. ఆంధ్రజ్యోతి పత్రికలో 'అభివృద్ధి పనులు.. నిరుపయోగం' పేరుతో గురువారం ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. రెండురోజులలో అమరావతి, ధరణికోటలో పర్యటించి, ఓ నివేదిక తయారు చేసి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

వెసులుబాటు మేరకు రైతులకు పరిహారం

భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ ఎం శ్రీదేవి

నకరికల్లు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పైపులైన్ విస్తరణలో రైతుల భూములకు పరిహారాన్ని వెసులుబాటు ఉన్నంత వరకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ ఎం శ్రీదేవి తెలిపారు. గురువారం నకరికల్లు-1 రైతు సేవా కేంద్రంలో బీపీసీఎల్ కృష్ణపట్నం నుంచి హైదరాబాద్ వరకు పైపులైన్ విస్తరణలో వెళ్తున్న రైతుల భూములకు పరిహారం విషయమై సమావేశం నిర్వహించారు. సమావేశంలో శ్రీదేవి మాట్లాడుతూ ఈ పైపులైన్ ఆంధ్రప్రదేశ్‌లో నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 308 కిలోమీటర్ల మేర ఉందని, ఒక్క పల్నాడు జిల్లాలో 84 కిలోమీటర్ల మేర ఉంటుందన్నారు. భూసేకరణ చట్టం ప్రకారం ఈ పైపులైన్ పరిధిలోకి వచ్చే భూముల మార్కెట్ విలువకు 2.25 రెట్లలో పదిశాతం పరిహారంగా అందిస్తామన్నారు. ఆయా భూముల్లో వ్యవసాయ పంటలు గాని, ఉద్యానపంటలు గాని ఉంటే పంటనష్టాన్ని రైతులకు చెల్లిస్తామని వివరించారు. నకరికల్లు, చల్లగుండ్ల, నరసింగపాడు రైతులకు సంబంధించిన భూముల పరిహారం వివరాలను తెలిపారు. రైతులు మాత్రం రోడ్డుకు దూరంగా ఉన్న భూములకు సెంటుకు రూ 50వేలు, రోడ్డు పక్కనే ఉన్న భూములకు సెంటుకు రూ.లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. తమకు జీవనాధారమైన ఈ భూమిని కోల్పోతే తమ పరిస్థితి దయనీయంగా ఉంటుందని, పైపులైన్ నిర్మాణాన్ని అడ్డగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీపీసీఎల్ ప్రాజెక్టు ఇన్‌చార్జ్ భగవాన్, సైట్ ఇంజనీరు పవన్, రైతులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాన్ని సిద్ధం చేయండి

● ఎంపీడీవో వెంగళరావు



వేమవరంలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంగళరావు తదితరులు

మాచవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఉన్న సంపద తయారీ కేంద్రాలను సిద్ధం చేసి ఫిబ్రవరి 15వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో వెంగళరావు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండలంలోని వేమవరం, మల్లవోలు గ్రామాల్లో ఉన్న సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి ఆయా గ్రామ కార్యదర్శులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి 250 కుటుంబాలకు ఒక క్లాప్ మిత్రను తప్పనిసరిగా నియమించుకోవాలని, వారి ద్వారా ఆయా గ్రామాల్లో ఇంటింటి నుంచి తడి చెత్త, పొడి చెత్తను సంపద తయారీకేంద్రాలకు తరలించాలని సూచించారు. ఆ కేంద్రంలో మంచినీటి వసతి, విద్యుత్ వసతి, ఫెన్సింగ్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఫిబ్రవరి 15 నుంచి పూర్తిస్థాయిలో ప్రభుత్వం నిర్దేశించిన పనులన్నీ సంపద తయారీ కేంద్రంలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలా తీసుకోనివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఉషారాణి, ప్రసాదు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

గాంధీ చూపిన మార్గంలో పయనించాలి

ఎమ్మెల్యే కన్నా



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు పయనించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం గాంధీబొమ్మ సెంటర్‌లో మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా పాల్గొని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, ఆతుకూరి నాగేశ్వరరావు, బీ సుబ్బారావు, జాన్‌బాబు, వెంకటరమణ, కొత్త లక్ష్మయ్య, పోట్ల ఆంజనేయులు, సుకూర్, బంగారు నాగరాజు, పూజల వెంకటకోటయ్య, బాపయ్యచౌదరి, వక్కంటి అజయ్, పలువురు టీడీపీ నేతలు, ఆర్యవైశ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం ప్రమాదంలో గాయపడిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు గృహానికి వెళ్ళి పరామర్శించారు.

● కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దాసరి జ్ఞాన్‌రాజ్ పాల్, వేదాద్రి, చాంద్‌బాషా, కొత్త లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏలియా మృతి బాధాకరం

సత్తెనపల్లి రూరల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్ల గ్రామానికి చెందిన నందిగం ఏలియా రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం బాధాకరమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ఎమ్మెల్యే గోరంట్ల వెళ్ళి మృతుని కుటుంబసభ్యులను ఓదార్చారు. ఏలియా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కన్నా వెంట టీడీపీ మండల, గ్రామ పార్టీ నాయకులు ఉన్నారు.

జాతికి మార్గదర్శి గాంధీజీ



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్ నరసింహారావు

మాచర్లటౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీ వేణుబాబు, క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, భవనారి సత్యనారాయణ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతలలో...

రెంటచింతల: జాతికి మార్గదర్శి గాంధీజీ అని గురజాల డీఎస్పీ జగదీష్ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రామాలయం సెంటర్‌లో ఏచూరి వెంకట సైదయ్య నేతృత్వంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్,విద్యావేత్త శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

కారంపూడిలో...

కారంపూడి: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు చీతిరాల వెంకట కోటేశ్వరరావు, మండల అధ్యక్షుడు ఎస్‌పీఆర్ కృష్ణ, జిల్లా కార్యదర్శి వెచ్చా వరలక్ష్మణరావు, టి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గిలో..

దుర్గి: స్థానిక వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గాంధీవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యేచూరి రమేష్‌బాబు, బీజేపీ నేత వెలిదండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

1న బహిరంగ వేలం

నకరికల్లు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 1వ తేదీన చేజర్ల కపోతేశ్వరస్వామి దేవాలయం వద్ద కొబ్బరికాయలు, పూజాద్రవ్యాలు అమ్ముకొనేందుకు, కొబ్బరిచిప్పలు తీసుకొనేందుకు లడ్డుప్రసాదం అమ్ముకొనేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వై వెంకయ్య తెలిపారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు నరసరావుపేటలోని శివుని బొమ్మ వద్ద గల అంకమ్మతల్లి దేవస్థానం వద్ద దేవదాయశాఖ అధికారుల సమక్షాన శనివారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జగన్ అవినీతితో రాష్ట్రానికి అప్పుల భారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

పెదకూరపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్‌రెడ్డి చేసిన అవినీతితో రాష్ట్రానికి అప్పుల భారం భారీగా పెరిగిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. తెలిపారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ పాలనతో రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా నాశనమైందని, ఆయన అవినీతి వల్ల రాష్ట్రానికి అప్పులు కూడా పుట్టని పరిస్థితి నెలకొందన్నారు. తెచ్చిన అప్పులను విలాసాలకు, జల్సాలకు ఖర్చు చేశారని, జగన్ విలాసాలకు ప్రభుత్వ సొమ్ము రూ.19,871కోట్లను వాడుకున్నారని ఆరోపించారు. గత ఐదేళ్ల పాలనలో రూ.8లక్షల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పులభారం నుంచి బయటపడవేయగల ఏకైక నాయకుడు చంద్రబాబు మాత్రమేనని, సంక్షోభంలో కూడా సంక్షేమాన్ని అందించగల సమర్థుడని పేర్కొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

పెదకూరపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జలాలపురం నుంచి కంభంపాడు వెళ్ళే తారు రోడ్డు పనులను మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పరిశీలించిన వారిలో ఏఈ రమేష్ ఉన్నారు.

తహసీల్దార్‌గా నాగలక్ష్మి బాధ్యతల స్వీకరణ



పెదకూరపాడు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు తహసీల్దార్‌గా ధనలక్ష్మి గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. నాదెండ్ల మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ బదిలీపై ఆమె పెదకూరపాడుకు వచ్చారు.

వడ్డెర మహిళా సంఘ అధ్యక్షురాలిగా వేముల శ్రీదేవి



సత్తెనపల్లి పట్టణ వడ్డెర సంఘ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన వేముల శ్రీదేవి

సత్తెనపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పట్టణ వడ్డెర సంఘం మహిళా అధ్యక్షురాలిగా వేముల శ్రీదేవిని నియమిస్తూ సంఘ రాష్ట్ర అధ్యక్షురాలు వేముల బేబీరాణి గురువారం పట్టణంలోని వాల్మీకి నగర్‌లో జరిగిన సంఘ సమావేశంలో నియామక ఉత్తర్వులు అందించారు. ఈ సందర్భంగా బేబీరాణి మాట్లాడుతూ వడ్డెర్లంతా సంఘంలో పని చేస్తూ సంఘ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తమ పిల్లలను విద్యావంతులను చేయాలని, రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమన్నారు. సమావేశంలో సంఘ నాయకులు బత్తుల నాగేశ్వరరావు, బత్తుల ఈశ్వరి, వేముల శివ, బత్తుల వెంకట స్వామి, కొమెర వీరాంజనేయులు, శ్రీనివాసరావు, ఒంటిపులి నాగేశ్వరరావు, గుంజి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి కౌన్సిల్ సమావేశం వాయిదా

సత్తెనపల్లి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీన జరగాల్సిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్టు మునిసిపల్ చైర్మన్ చలంచర్ల లక్ష్మీతులసీ గురువారం తెలిపారు. ఎంఎల్‌సీ ఎన్నికల కోడ్ దృష్ట్యా ఈ సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని తెలిపారు.

'న్యూటన్స్'లో విప్రో క్యాంపస్ ఇంటర్వ్యూలు

మాచర్లటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని న్యూటన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విప్రో కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలలో కళాశాలకు చెందిన 27 మంది ఉద్యోగాలు సాధించారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ జున్నా శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరెడ్డి, టీపీవో రామ్మోహనరెడ్డి, హెచ్‌వోడీలు, అధ్యాపకులు అభినందించారు.

కేంద్రీయ విద్యాలయ ప్రతిపాదిత స్థల పరిశీలన



కేంద్రీయ విద్యాలయం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మాచర్ల రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపల్లిలో సర్వే నంబరు 162/3బి-1బి3డిలో 12 ఎకరాల స్థలాన్ని కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు మంజూరైంది. ఈ మేరకు కేంద్రీయ విద్యాలయ సంఘటన్ న్యూఢిల్లీ అడిషనల్ కమిషనర్ రెజివిఆర్ నాథ్, హైదరాబాద్‌కు చెందిన రీజనల్ అధికారి కేవీఎస్, మిర్యాలగూడ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ కేఎస్ఎన్ ప్రసాద్‌లు గురువారం తాళ్లపల్లిలో ఆ స్థలాన్ని పరిశీలించారు. అక్కడి భౌగోళిక పరిస్థితులు, నీటివసతి, విద్యుత్ సదుపాయం, అప్రోచ్‌రోడ్డు మొదలైన వాటిని పరిశీలించారు. నిర్మాణం జరిగే లోపు తాత్కాలిక విద్యాలయం ఏర్పాటుకు మాచర్లలోని జడ్పీ బాలురోన్నత పాఠశాలలో గదులను పరిశీలించారు. స్థలాన్ని పరిశీలించిన వారిలో మండల స్పెషలాఫీసర్ గ్రబూనాయక్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ ఆవుల వెంకట్రామయ్య ఉన్నారు.

ఘర్షణ కేసులో ఆరుగురికి రిమాండ్

దుర్గి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆస్తి వివాదాల నేపథ్యంలో ఘర్షణ పడి ఇరువర్గాలు ఒకరిపై ఒకరు కత్తులు, కర్రలతో దాడి చేసుకున్న కేసులో ఆరుగురికి మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ సుధీర్‌కుమార్ గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈనెల 28న మండలంలోని పోలేపల్లిలో వినుకొండ కాశయ్య, జల్లెల ఏడుకొండలు వర్గీయులు ఆస్తి వివాదాల నేపథ్యంలో పరస్పరం దాడి చేసుకున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు వినుకొండ కాశయ్య, గోపి, వినయ్, నీలావతి, కాశమ్మలతోపాటు మరో వర్గానికి చెందిన జల్లెల ఏడుకొండలు, భానుప్రకాష్, లక్ష్మీనారాయణ, వినుకొండ రమణకుమారిలపై కేసు నమోదు చేశామన్నారు. వినుకొండ కాశయ్య, గోపి, వినయ్, జల్లెల ఏడుకొండలు, భానుప్రకాష్, లక్ష్మీనారాయణలకు కోర్టు రిమాండ్ విధించగా గురజాల సబ్‌జైలుకు తరలించారు. వినుకొండ లీలావతి, కాశమ్మ, రమణకుమారి నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గాంధీజీకి ఘన నివాళులు



క్రోసూరు: పోలీసు స్టేషన్ ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎస్‌ఐ నాగేంద్రరరావు, ఆర్యవైశ్య నాయకులు

క్రోసూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గాంధీ వర్ధంతి నిర్వహించారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పోలీసుస్టేషన్ ఆవరణలో మహాత్మాగాంధీ విగ్రహానికి ఎస్‌ఐ నాగేంద్రరరావు ఆర్యవైశ్యసంఘం నాయకులతో కలసి పూలదండలు వేసి నివాళులర్పించారు. గాంధీచౌక్‌లోను, ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నివాళులర్పించారు.

● బెల్లంకొండ: మండలంలోని చంద్రాజుపాలెం పీహెచ్‌సీలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కోటేశ్వరరావు, పీహెచ్‌వో మణికుమారి, తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట: స్థానిక వాసవిక్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాన్ని మండల ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆసియాలోనే అతి పెద్ద మార్కెట్ యార్డుగా పేరుగాంచిన గుంటూరు మిర్చియార్డులో సమస్యలు నిత్య నూతనమే. ప్రభుత్వాలు, పాలక మండళ్లు మారుతున్న ప్రతిసారీ ఏవో కొన్ని చిన్నచిన్న ఉపశమన, ఉద్దీపన చర్యలే మినహా ఏ సమస్యను వ్యవస్థాగతంగా సమూలంగా నిర్మూలించింది లేదు. దీంతో మిర్చియార్డుకి వచ్చిన రైతు తన పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకొని బయటికి వెళ్లింది లేదు. అలాగే మిర్చియార్డులో పనిచేస్తున్న వందలాది మంది అసంఘటిత రంగ కార్మికులు వారి హక్కుల కోసం పోరాడుతూనే ఉన్నారు. రైతుల కష్టం, కార్మికుల శ్రమపై ఆధారపడి సాగుతోన్న కోట్లాది రూపాయల వ్యాపారంలో కమీషన్ వ్యాపారులు, ఎగుమతిదారులే లబ్ధిపొందు తుంటారనేది బహిరంగ రహస్యమే! ఈ పరిస్థితుల నేపథ్యంలో గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చియార్డు)కి ఉన్నతశ్రేణి కార్యదర్శిగా చంద్రిక నేడు బాధ్యతలు స్వీకరించనున్నారు.

సమస్యలు.. సవాళ్లు..





నేడు బాధ్యతలు స్వీకరించనున్న చంద్రిక..

మిర్చియార్డు (వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు) ఉన్నతశ్రేణి కార్యదర్శిగా చంద్రిక శుక్రవారం మిర్చియార్డు పరిపాలన భవనంలో బాధ్యతలు స్వీకరించనున్నారని యార్డు అధికారవర్గాలు ధ్రువీకరించాయి. చంద్రిక మునిసిపల్ పరిపాలన శాఖలో స్పెషల్ గ్రేడ్ కమిషనర్ హోదాలో ఉన్నారు.



- మిర్చియార్డులో జోరుగా జీరో వ్యాపారం..
- రైతుల కష్టాన్ని దోచేస్తున్న 'మచ్చు'
- కొత్త లైసెన్సుల కోసం రాజకీయ ఒత్తిళ్లు
- రైతులను ముంచుతున్న వ్యాపారులు
- సీజన్‌లో యార్డుని ముంచెత్తుతున్న మిర్చి
- తప్పని ట్రాఫిక్ కష్టాలు..
- నేడు నూతన సెక్రటరీ బాధ్యతల స్వీకారం..

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిపాలన శాఖ నుంచి డిప్యూటేషన్‌పై నేడు మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించ నున్న చంద్రిక ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. ఈ ఏడాది మిర్చి సీజన్ కొద్ది రోజుల క్రితమే ప్రారంభమైంది. ఇప్పటికే రోజుకు లక్ష మిర్చి టిక్కీల వరకు రాక ప్రారంభమైంది. ఈనామ్ పేరుకు ఆన్‌లైన్ ట్రేడింగ్ అయినప్పటికీ ఆఫ్‌లైన్‌లోనే కొనసాగుతోంది. యార్డులోకి వచ్చే లారీల్లో మిర్చి టిక్కీలకు లాట్ ఐడీలు జనరేట్ చేయడంలోనే జాప్యం జరుగుతోంది. ఒక వాహనంలో వచ్చే టిక్కీలు ఒక దుకాణం వద్ద కాకుండా వేర్వేరు దుకాణాల వద్ద రైతులు దింపుతుండటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఫిబ్రవరి 15వ తేదీ తర్వాత రోజుకు రెండు లక్షల టిక్కీలకు పైగా యార్డులో విక్రయానికి వస్తాయి. ఇక పీక్ సీజన్ అయిన మార్చి, ఏప్రిల్‌లో మూడు లక్షల టిక్కీల వరకు కూడా వస్తాయి. ఈ నేపథ్యంలో ఎరైవల్స్, సేల్స్ సాఫీగా జరిగితేనే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావు. లేకుంటే రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగే పరిస్థితులు ఉత్పన్నం అవుతాయి. ముఖ్యంగా ఈనామ్‌లో ట్రేడింగ్ అయిన మిర్చి టిక్కీలు వెంటనే కాటాలు అయి సాయంత్రం లోపే బయటకు వెళ్లిపోవాలి. లేకుంటే రాత్రి 8 గంటల నుంచి కొత్త సరుకు రావడం ప్రారంభమౌతుంది. అప్పుడు యార్డులో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. యార్డులో కమీషన్ దుకాణాల ఎదుట పసుపు, ఎరుపు గీతల విధానం అమలులో ఉన్నది. ఎట్టి పరిస్థితుల్లో మిర్చి టిక్కీలు ఎర్రరంగు గీత వరకు రాకుండా చూస్తేనే వాహనాల రాకపోకలు సాగుతాయి.

బిడ్డింగ్‌లో కేవలం ఒకరు, ఇద్దరు మా త్రమే వేస్తుంటారు. దీంతో పోటీ అనేది ఉండదు. కమీషన్ వ్యాపారి ఎంత చెబితే అంత ధరకు రైతు ఎగుమతిదారుడికి విక్రయించాల్సిందే. యార్డులో పేరుకు 680 మంది కమీషన్ వ్యాపారస్థులున్నప్పటికీ వారిలో ట్రేడింగ్ జరిపేది 100 నుంచి 200 మంది మాత్రమే. మిగతా వ్యాపారస్థులు నామమాత్రంగానే వ్యాపారం చేస్తుంటారు.

జోరుగా జీరో వ్యాపారం ..

మిర్చియార్డులో బిల్ టూబిల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. కమీషన్ వ్యాపారి వద్ద ఎలాంటి పెట్టుబడి ఉండదు. అతను వేరే ఫరం మీదకు తన వద్దకు వచ్చిన మిర్చి టిక్కీలను మార్పు చేస్తాడు. ఇందుకు రైతు వద్ద 2 శాతం కమీషన్‌కు బదులుగా నాలుగైదు శాతం వసూలు చేస్తారు. దీని వలన రైతు తీవ్రంగా నష్టపోతున్నాడు.

- మిర్చియార్డులో జీరో వ్యాపారం ఒకటి వేళ్లూను కొని ఉంది. యార్డులోకి ప్రవేశించిన సరుకుని ఈనామ్‌లో ఎంట్రీ కాకుండానే ట్రేడింగ్ జరిపించేసి బయటకు పంపేస్తారు. ఇది సూపర్‌వైజర్లకు తెలియకుండా జరిగే అవకాశమే లేదన్నది బహిరంగ రహస్యమే. దీని వలన ఏటా మిర్చియార్డు రూ. కోట్లలో మార్కెట్ ఫీజు రూపంలో ఆదాయాన్ని కోల్పోతోంది.
- రేట్ కటింగ్ బిజినెస్ కూడా మార్కెటింగ్ శాఖ ఆదాయానికి గండి కొడుతోంది. రైతుకు చెల్లించేది ఒక ధర, ఈనామ్‌లో ఎంట్రీ చేసే ధర అంతకంటే తక్కువగా చూపిస్తారు. దీని వలన అటు ఎక్స్‌పోర్టరు, ఇటు కమీషన్ వ్యాపారి మాత్రమే లాభ పడతారు. మార్కెటింగ్ శాఖకు ఒక శాతం ఫీజు రూపంలో ఆదాయం కోల్పోతోంది.
- సీజన్ వచ్చిందంటే కమీషన్, ఎక్స్‌పోర్టు వ్యాపారస్థుల గుమాస్తాలకు పండగే. రైతులు తీసుకొచ్చే మిర్చి టిక్కీల నుంచి మచ్చుకాయలు(శాంపిల్స్) తీస్తారు. ఆ కాయలను తిరిగి రైతుల మిర్చి టిక్కీల్లో పోయరు. బయటకు తీసుకెళ్లి ఎంచక్కా అమ్ముకొంటారు. ఒక్కో సీజన్‌లో ఒక్కో గుమాస్తా రూ. లక్షల్లోనే వెనకేసుకొంటాడని నానుడి.

యథేచ్ఛగా వ్యాపారుల అక్రమాలు..

ఇటీవలకాలంలో అటు కమీషన్, ఇటు ఎగుమతిదారులు, కోల్డ్‌స్టోరేజ్‌ల యజమానులు అనేక అక్రమాలకు పాల్పడిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. రైతులు వద్ద సరుకు తీసుకోవడం రూ. కోట్లలో ఐపీ పెట్టిన సంఘటనలపై కేసులు కూడా నమోదయ్యాయి. అలానే రైతులకు తెలియకుండా కోల్డ్‌స్టోరేజ్‌ల నుంచి సరుకు మాయం చేసిన ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఆయా ఘటనల్లో బాధిత రైతులు కేసులు పెట్టడం మినహా వారికి న్యాయం జరిగింది లేదు.

ఉచిత భోజనం సగం మంది రైతులకే ..

మిర్చియార్డుకి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని నుంచే కాకుండా ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా రైతులు మిర్చిని తీసుకొస్తుంటారు. ఆయా సందర్భాల్లో మిర్చియార్డులో రైతులు విశ్రాంతి తీసుకోవడానికి భవనాలు ఉన్నాయి. రైతులు ఆహారానికి ఇబ్బంది పడకూడదని ఏటా సీజన్‌లో ఉచితంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. అయితే ఈ టోకెన్ల జారీ విషయంలో అక్రమాలు జరుగుతున్నాయి. రైతులు కంటే ప్రైవేటు వ్యక్తులు ఎక్కువ మందికి టోకెన్లు జారీ చేస్తున్నారన్న విషయం బహిరంగ రహస్యమే. దీని మీద అధికారులు చర్యలు చేపడితే వెంటనే వివిధ యూనియన్ల వారు, వారి అనుచరులను రెచ్చగొట్టి ఆందోళనలు చేయించడం చేస్తుంటాయి. ఇలా అరకొరమంది రైతులకు అల్పాహారం, భోజనం అందుతోంది.

గత ఏడాది మహిళ సెక్యూరిటీ గార్డులు మచ్చుకాయలు తీసుకెళుతున్న వారిని అడ్డుకొంటే యూనియన్ నాయకులు హమాలీలను రెచ్చగొట్టి నానా యాగీ చేసి ఆ సెక్యూరిటీ గార్డుల ఉద్యోగాలు తీసేయించాయి.



సాగు.. తారుమారు

(5వ పేజీ తరువాయి)

తీవ్ర ప్రభావం చూపాయి. పైగా పంటకు మార్కెట్‌లో ధర లభించలేదు. ధర పతనమవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మిరప సాగుకు వేలాది మంది రైతులు దూరమయ్యారు. గత ఏడాది మూడు జిల్లాల్లో 1,71,226 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ ఏడాది 1,15,422 ఎకరాలకు మిరప సాగు పరిమిత మైనట్లు ఉద్యాన శాఖ గణాంకాలు చెబుతున్నాయి. క్రితం సారి కన్నా దాదాపు 55,804 ఎకరాల్లో మిరప సాగు తగ్గింది. మార్కెట్‌లో ధర లేకపోవడంతో పాటు నల్ల తామరతో దిగుబడులు తగ్గడంతో నష్టపోయిన రైతులు ఈ సారి మిరప సాగుకు దూరమయ్యారు. మార్కెట్‌లో మిరప క్వింటాల్ రూ.12 వేల నుంచి రూ.13 వేలు ఉందని రైతులు చెబుతున్నారు. క్రితం సంవత్సరం కన్నా క్వింటాకు రూ.6 వేల వరకు ధర తగ్గిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మిరపకు గిట్టుబాటు ధర కల్పిం చాలని రైతులు కోరుతున్నారు. మిరపకు ధర కల్పించాలని సీఎం చంద్రబాబును రైతుల పక్షాన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఆయన సానుకూలంగా స్పందించ డంతో ప్రభుత్వం సాయం అందిస్తుందని మిరప రైతులు ఆశపడుతున్నారు. ప్రభుత్వం మిరప రైతుల సంక్షేమం కోసం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

గణనీయంగా పెరిగిన మొక్కజొన్న.. పొగాకు సాగు

మిరప గిట్టుబాటు కాకపోతుండటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపారు. దీంతో మొక్కజొన్న, పొగాకు పంటల సాగు గణనీయంగా పెరిగింది. అంచనాలను తారుమారు చేస్తూ గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ ఏడు పొగాకు సాగు పెరిగింది. మిరపతో పాటు శనగ సాగు కూడా గణనీయంగా తగ్గింది. గత ఏడాది శనగ సాగు కలిసిరాకపోవడంతో సదరు రైతులు మొక్కజొన్న, పొగాకు సాగు చేశారు.

మంగళగిరి చేనేతకు జీవం

(5వ పేజీ తరువాయి)

కంచి సిల్క్ పార్కు తరహాలో ఏర్పాటు చేయాలని ఆ మె అధికారులను ఆదేశించారు. ఈ చేనేతపార్కుతో మంగ ళగిరిలో మళ్లీ చేనేతకు కొత్తజీవం పోసుకోబోతుందనడంలో సందేహం లేదు. చేనేతపార్కు అంటే..పచ్చి నూలు మొద లు చీర తయారీ మార్కెటింగ్ సౌకర్యాన్ని కూడా ఇక్కడి నుంచే ఏర్పాటు చేస్తారు. మంగళగిరి వస్త్రాలకు గిరాకీ పెంచే ఉద్దేశ్యంతో కంచి చేనేతపార్కు తరహాలో దీనికి సి ల్కును కూడా జోడించాలని మంత్రి సవిత సూచించారు.

ప్రస్తుతం మగ్గాల సంఖ్య 1400

మంగళగిరిలో ప్రస్తుతం మగ్గాల సంఖ్య 1400. రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో ఆరు భారీ షెడ్లను ఏర్పాటుచేసి 146 ఫ్రేమ్ మగ్గాలను నేత కార్మికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. రత్నాలచెరువులో 520 మగ్గాలు, ఇందిరాన గర్, పాతమంగళగిరి కలిపి 350 మగ్గాలు, ఆత్మకూరులో 60, ఎర్రబాలెంలో 225, తాడేపల్లిలో ఎనిమిది, చినకాకాని లో 20, కాజలో ఆరు, నవులూరులో సుమారు వంద వరకు మగ్గాలు ఉన్నాయి. నూతనంగా ఏర్పాటు కాబోతున్న మెగా చేనేతపార్కులో వేయికిపైగా ఫ్రేమ్ మగ్గాలను ఏర్పాటుచే స్తారని అంచనా వేస్తున్నారు. ఈ పార్కు ఏర్పాటుతో ప్రత్య క్షంగా కానీ, పరోక్షంగా కానీ సుమారు ఐదారు వేలమందికి ఉపాధి కలగనుంది. ఇక ఈ పార్కులో యారన్ డిపో, అ డ్మినిస్ట్రేటివ్, రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్ భవనాలు, డిస్పె న్సరీ, క్యాంటీన్, కాఫీషాపు, మార్కెటింగ్ కాంప్లెక్స్ వర్క్‌షా పు, వేర్ హౌస్, కాన్ఫరెన్స్‌హాలు, ఆడియో వీడియో సెంట ర్, విశ్రాంతి భవనం, వే బ్రిడ్జి, సెక్యూరిటీ భవనం, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్, ఎక్విప్‌మెంట్ అండ్ ఫర్నిచర్ ఫర్ టెస్టింగ్ అండ్ ట్రైనింగ్ సెంటర్, సిల్క్ ఈటీపి, కాటన్ ఈటీపీ తదితరాలను ఏర్పాటు చేస్తారు.

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

- సీఎం కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం విజ్ఞప్తి

గుంటూరు సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాలుగా రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను వెంటనే విడుదల చేయాలని సీఎం చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రిని కలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ)జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. సర్పంచుల గౌరవ వేతనాన్ని రూ. 3 వేల నుంచి రూ.15 వేలకు పెంచాలని కోరారు. సర్పంచులు విధి నిర్వహణలో మరణిస్తే రూ. 20 లక్షల వరకు ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని, గిరిజన తండాలను ప్రత్యేకంగా పరిగణించి ప్రత్యేక నిధులు మంజూరు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.



సీఎం చంద్రబాబుకి వినతి పత్రం అందజేస్తున్న డాక్టర్ వీరాంజనేయులు

టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధికి రూ.25 లక్షల విరాళం



నారా లోకేశ్ రూ. 25 లక్షల చెక్కును అందజేస్తున్న టీడీపీ నేత మాదాల చైతన్య

గుంటూరు(తూర్పు), జనవరి 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధికి ప్రముఖ పారిశ్రామిక వేత్త, టీడీపీ నాయకుడు మాదల చైతన్య రూ.25 లక్షల విరాళాన్ని ప్రకటించారు. గురువారం ఉండవల్లిలోని మంత్రి లోకేశ్ నివాసంలో ఆయనకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాదాల చైతన్య మాట్లాడుతూ కార్యకర్తలను అన్ని విధాలుగా ఆదుకుంటున్న ఏకైక పార్టీ టీడీపీయేనని అన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం నిరంతరం కష్టపడు తున్న చంద్రబాబుకు, లోకేశ్‌కు తాము ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా చైతన్యను లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు.




డీఈవోకి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

తరగతుల తరలింపు విరమించుకోవాలి

గుంటూరు (విద్య) జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉన్న 3,4,5 తరగతులు తరలించి కేవలం 1,2 తరగతులు ఉంచి ఫౌండేషన్ స్కూల్‌గా మార్చడాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం కళాధర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం డీఈవో సీవీ రేణుక వినతిపత్రం అందజేశారు. అనంతరం కళాధర్ మాట్లాడుతూ మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఫౌండేషన్ స్కూల్ విధానం రాష్ట్రంలో విఫలమైందని, ఈ ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. కార్యక్ర మంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, ఎం గోవిందు, కె రంగారావు, ఎం కోటి రెడ్డి తదితరుడు పాల్గొన్నారు.



టమోరా!



- భారీగా పడిపోయిన ధర
- హోల్‌సేల్‌లో కిలో రూ. 10, రిటైల్‌లో రూ.20
- ఇదే బాటలో క్యాలీఫ్లవర్, వంకాయ, ములక్కాయ
- పెరిగిన దోసకాయ, బెండకాయలు..

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్‌లో ఒకప్పుడు అధిక ధరతో దడపుట్టించిన టమోటా ధర ప్రస్తుతం పడిపోయింది. టమోటా ప్రస్తుతం హోల్‌సేల్‌లో కిలో రూ.10లకు విక్రయిస్తుండగా రిటైల్ చిల్లర దుకాణాల్లో రూ. 20లకు విక్రయిస్తున్నారు. టమోటా పంట దిగుబడి గణనీయంగా పెరగటం, స్థానిక టమోటా పంట ఉత్పత్తులు మార్కెట్‌కు రావటంతో ధరలు ఒక్కసారిగా దిగజారిపోయాయి. రైతుబజారులో టమోటా కిలో రూ. 13కు విక్రయిస్తుండగా పెద్ద మార్కెట్లో కిలో రూ. 15 నుంచి రూ. 20 వరకు విక్రయిస్తున్నారు. క్యాలీఫ్లవర్ గత నెలలో ఒకటి రూ. 50 లనుంచి రూ. 40 ధర ఉండగా ప్రస్తుతం రూ. 20లకు లభిస్తుంది. ములక్కాయ కూడా గత నెలలో ఒకటి రూ. 30 విక్రయించగా దిగుబడి పెరగటం , స్థానికంగా పంట కూడా మార్కెట్‌కు రావటంతో రూ. 20లకు చేరుకుంది. వంకాయలు కూడా కిలో గత నెలలో రూ. 60లు ఉంటే ప్రస్తుతం రూ. 40లకు దగ్గింది. బంగాళదుంపలు కూడా కిలో రూ. 45 లు గత నెలలో ఉంటే ప్రస్తుతం కిలో రూ. 30లకు తగ్గినట్లు చెబుతున్నారు. ఇక క్యారెట్ కూడా ధరలు తగ్గిన జాబితాలో చేరాయి. క్యారెట్ కిలో రూ. 60లు ఉంటే ప్రస్తుతం రూ. 40లకు దగివచ్చింది.



పెరిగిన బెండ, దోస ధరలు..

ఇక కొన్ని రకాల కూరగాయలు ధరలు తగ్గితే మరికొన్ని కూరల ధరలు మండుతున్నాయి. బెండకాయలు గత నెలలో కిలో రూ. 20ల నుంచి రూ. 30లకు విక్రయించగా ప్రస్తుతం అవి కాస్త అమాంతం కిలో రూ. 60లకు చేరుకున్నాయి. పంట దిగుబడి తగ్గటం, స్థానికంగా కూడా పంట ఉత్పత్తి పెద్దగా లేకపోవటంతో మార్కెట్లో ధరలు పెరిగాయని కూరగాయల వ్యాపారి రాపోలు మల్లికార్జునరావు తెలిపారు. దోసకాయల ధరల పరిస్థితి కూడా అదే బాటలో ఉంది. దోస గత నెలలో కిలో రూ. 30 ఉంటే ప్రస్తుతం రూ. 60లకు ఎగబాకింది. దాంతో కొనుగోలుదారులు దోసకాయలంటేనే వెనుకాడుతున్నారు. ఇక పచ్చి మిర్చి, కాకర ఇతర కూరగాయాలన్నీ సాధారణ ధరలే కొనసాగుతున్నాయి. టమాటా ధర ఇలాగే కొనసాగితే తాము తీవ్రంగా నష్ట పోయే ప్రమాదం ఉందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఆహారం కోసం కొంగల విన్యాసాలు..

గుంటూరు రూరల్ మండలం లింగాయపాలెం చెరువులో గేదెలపై విన్యాసాలు చేస్తున్న కొంగలివి. గేదెలపై వాలిన క్రిమి కీటకాలను తింటూ ఆకలి తీర్చుకునేందుకు కొంగలు చేస్తున్న విన్యాసాలు చూపరులకు ఆకర్షణీయంగా ఉన్నా గేదెలకు మాత్రం ఇబ్బందికరంగా ఉంటుంది.









పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

రేపు కే-రిడ్జి స్కూల్‌లో ఫ్లోర్ బాల్ జట్ల ఎంపిక

నరసరావుపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ ఫిబ్రవరి 1న అండర్-17 ఫ్లోర్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక జరుగుతుందని స్కూల్ ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. 2008 జూన్ 1లోపు జన్మించిన వారు ఎంపికలో పాల్గొనవచ్చని ప్రిన్సిపాల్ బర్నబాస్, ఫ్లోర్‌బాల్ సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లవరపు కిషోర్‌బాబు తెలిపారు. పోటీలకు హాజరయ్యేవారు ఆధార్ కార్డు, స్కూల్ స్టడీ సర్టిఫికెట్ తీసుకొని రావాలన్నారు. అదనపు సమాచారం కోసం 8639922976ను సంప్రదించాలన్నారు.

జొన్నలగడ్డ వద్ద మరో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలి

నరసరావుపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నలగడ్డ వద్ద మరో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. గురువారం నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో మురళిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జొన్నలగడ్డ వద్ద రైల్వే నిర్మించిన అండర్ బ్రిడ్జి రాకపోకలకు పూర్తిగా వినియోగం కానందున దాని సమీపంలో మూడు మీటర్ల వెడల్పు, మూడు మీటర్లు ఎత్తుగా మరో అండర్ గ్రౌండ్ బిడ్జి నిర్మాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ మాజీ సర్పంచ్ ఎర్రం వెంకటేశ్వర్లు, రైతు నాయకులు నల్లపాటి రమేష్‌బాబు, పీడీఎం నాయకుడు నల్లపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో విగ్రహాలకు ముసుగులు

వినుకొండ టౌన్, జనవరి 320 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 29వ తేదీ నుంచి ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో పట్టణంలోని ప్రధాన కూడళ్లలోని మాజీ ముఖ్యమంత్రులు ఎన్‌టీఆర్, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు అధికారులు ముసుగులు వేశారు. పట్టభద్రుల నియోజక వర్గ శాసనమండలి సభ్యుని ఎన్నిక నేపథ్యంలో ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు తహసీల్దార్ సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలి

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, జనవరి 30: (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు, సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో గురువారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం లోకి వచ్చేందుకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను నిర్వీర్యం చేసారని ఆరోపించారు. రెండు రోజులుగా సీఎం నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ పథకాలు, సూపర్‌సిక్స్ పథకాలకు నిధులు లేవని, దానికి కారణం గత ప్రభుత్వం అని వైసీపీపై బురద జల్లే ప్రయత్నం మానుకోవాలి అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు - కారు ఢీ: నలుగురికి గాయాలు

నాదెండ్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటూరు - కర్నూలు రహదారిపై సాతులూరు సమీపంలోని భారత్ పెట్రోల్ బంకు సమీపంలో బస్సు-కారు ఢీకొన్న సంఘటనలో నలుగురు గాయపడ్డారు. వినుకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో విజయవాడ వెళ్తుండగా, గుంటూరు వైపు నుంచి నరసరావుపేట వైపు వెళ్ళే కారును ఢీకొట్టింది. ప్రమాదంలో నలుగురు గాయపడగా చికిత్సకోసం నరసరావుపేటలోని ఒక ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. నాదెండ్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఏఎంరెడ్డి విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని న్యేరా కంపెనీ స్థానిక పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో వర్చువల్ డ్రైవ్ గురువారం నిర్వహించింది. 24 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. ఎంపికైన వారికి ఒక్కొక్కరికి ఏడాదికి రూ.3.50 లక్షలు జీతం అందజేస్తారని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తు నాశనం

● మోటివేషనల్ స్పీకర్ చిరంజీవి

నరసరావుపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వల్ల యువత భవిష్యత్తు నాశనం అవుతుందని మోటివేషనల్ స్పీకర్ ఎం.చిరంజీవి అన్నారు. గురువారం కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణ, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎం.చిరంజీవి మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ డాక్టర్ హాస్పటల్ ఎండీ డాక్టర్ లక్ష్మి, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మోహీద్దీన్, ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ గంగాధరరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ వలంటీర్లు పాల్గొన్నారు.

కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

నరసరావుపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థుల మనో వికాసానికి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్‌బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డీ యోగేశ్వరరావు, జె మల్లారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్సీ వసతి గృహంలో నడుస్తున్న తరగతులు

ఈపూరు మోడల్ స్కూల్

విద్యార్థులకు అవస్థలు

- సొంత భవనం లేక ఎస్సీ వసతి గృహంలో తరగతులు
- 210 మంది విద్యార్థినులకు రెండు మరుగుదొడ్లు
- అర్ధంతరంగా నిలిచిపోయిన భవన నిర్మాణపనులు

ఈపూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలోని పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యనందించే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన ఏపీ మోడల్ స్కూల్ సౌకర్యాల లేమితో విద్యార్థులు ఉపాధ్యాయులు నానా అవస్థలు పడుతున్నారు. పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలలో తరగతులను నిర్వహిస్తున్నారు. 464మంది విద్యార్థులు ఉన్నప్పటికీ పాఠశాలకు సొంత భవనం లేదు. 2014 సంవత్సరంలో పాఠశాల మంజూరైంది. అప్పట్లో తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరై ఈపూరు సమీపంలో బోటుమీద ప్రభుత్వ భూమిలో పనులు ప్రారంభించారు. కొందరు ఆ స్థలం తమదేనంటూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదుచేశారు. అంతటితో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఆ వెంటనే కొచ్చెర్ల గ్రామస్థులు సుమారు 6 ఎకరాల స్థలాన్ని పాఠశాల నిర్మాణానికి ఇచ్చారు. అప్పటి ప్రిన్సిపాల్ అంతగా శ్రద్ధ చూపకపోవడంతో అక్కడ నిర్మాణం జరగలేదు. అప్పటి నుంచి వసతి గృహాలలోని ఇరుకు గదులలో విద్యార్థులు పాఠాలు వినాల్సిన పరిస్థితి ఏర్పడింది. చదువుకోవడానికి వచ్చే విద్యార్థులు విద్యనభ్యసించడం ఎలా ఉన్నా అవస్థలు మాత్రం తప్పలేదు. సొంత భవనం లేకపోవడంతో పిల్లలకు నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నారు. పాఠశాలలో 210 మంది విద్యార్థినులకు రెండు మరుగుదొడ్లు ఉండడంతో వారి అవస్థలు చెప్పనలవికావడంలేదు. తాగునీరు లేకపోవడంతో బయట నీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే వంట గదులు లేక ఆరుబయటనే వంట చేస్తున్నారు. నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాల నిర్మాణానికి సుమారు రూ.3కోట్లు మంజూరయ్యాయి. తరగతి గదులతో పాటు బాలికలకు వసతి గదుల నిర్మాణం చేపట్టారు. నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది.



నిర్మాణంలో ఉన్న మోడల్ స్కూల్ భవనం

విద్యార్థుల భద్రతపై దృష్టిపెడుతున్నాం

పాఠశాలకు సొంత భవనం, ప్రహరీ లేదు. దాంతో పాఠశాలలో బోధన కంటే వారి భద్రతపైనే ఎక్కువ దృష్టి పెట్టాల్సి వస్తోంది. విద్యార్థులకు కంప్యూటర్ తరగతులు బోధించలేని పరిస్థితి. వసతి గృహాలలో విద్యను సక్రమంగా బోధించలేకపోతున్నాం. వసతులు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నాం. వనికుంట వద్ద నిర్మాణం జరుగుతున్న పాఠశాల భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది.



పి.సునీల్ చౌదరి, ప్రిన్సిపాల్



మహాత్మాగాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కొమ్మాలపాటి, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తదితరులు

మహాత్మాగాంధీకి ఘన నివాళి

నరసరావుపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం నియోజకవర్గంలో పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ చూపించిన సత్యం, అహింసా మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని టీడీపీ నాయకులు అన్నారు. గురువారం నరసరావుపేట టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, వాణిజ్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి అత్తులూరి సుబ్బారావు, గొట్టిపాటి జనార్దన్‌బాబు, వనమా శివ, అంకమ్మ చౌదరి,జీపీ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ నాయకులు బేతంచర్ల రామ కోటేశ్వరరావు, ఎం రాధాకృష్ణ, షేక్ నసురుద్దీన్ రిటైర్డ్ లెక్చరర్ తోకల సాంబశివరావులు పాల్గొన్నారు. బొప్పూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక వేద స్కూలులో, పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గడియార స్తంభం సెంటర్ లోని జాతిపిత గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త కోటేశ్వరరావు, గుర్రం సాంబశివరావు, కొత్త మాసు శ్రీనివాసరావు పాల్గొన్నారు. వాసవి క్లబ్, వాసవీ వనిత క్లబ్, యంగ్ స్టార్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపం ఆవరణలో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. డాక్టర్ ఎ.సురేష్, చేవూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గాంధీ విగ్రహానికి వాసవి క్లబ్ వైభవ్ అధ్యక్షుడు గజ్జవల్లి సుబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు, వాసవి క్లబ్ వైభవ్ సభ్యులు, కజ్జాయం లక్ష్మీనారాయణ, దేసు కోటేశ్వరరావు, అర్వపల్లి నరసింహారావు, కజ్జాయం రామారావు, గుడిపాటి రామారావు, కోట శ్రీనివాసరావు, అర్వపల్లి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ గూండ్ల వెంకయ్య, గజ్వేలు పేరయ్య, కజ్జాయం ఈశ్వర్, అర్వపల్లి సుబ్రహ్మణ్యం, హెచ్ఎం షేక్ అలీషా, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పట్టణంలో జనసేన ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి అద్దేపల్లి ఆనందబాబు, మండల అధ్యక్షుడు కృష్ణంశెట్టి గోవిందు, ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ మిరియాల వెంకటసుబ్బమ్మ, ఆర్‌కే యాదవ్, గుప్తా శ్రీకాంత్, చిన్నపల్లి సాంబ, కృష్ణంశెట్టి సిద్దయ్య, పృధ్వీ, నాని, శ్రావణి, జక్కా నిర్మల, రేణుక, మాధవి తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం స్థానిక న్యాయస్థాన భవనాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు అన్ని కోర్టులలో, న్యాయవాద సంఘ కార్యాలయంలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం న్యాయవాద సంఘ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదర మెట్ల నాగేశ్వరరావు, న్యాయవాదులు కె విజయ్‌కుమార్, జి.హనుమంతరావు, బొల్లా సురేష్, వై శ్రీనివాసరెడ్డి, సీహెచ్ రాజేశ్వరరావు, ఎండీ షరీఫ్, మల్లికార్జున రావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



వెల్లటూరు జడ్పీ హైస్కూల్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వాసవి క్లబ్ వైభవ్ అధ్యక్షుడు సుబ్బయ్య తదితరులు

● నరసరావుపేట పట్టణంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ 77వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు, రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వనమా సాంబశివరావు, ఐనవోలు సాంబశివరావు, పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి తడికమల్ల బాల, తాళ్లూరి సత్యనారాయణ, నాగవరపు ప్రసాద్, తడువాయి రామకృష్ణ, గౌరు శ్రీనివాస్, కోట సత్యం, షణ్ముఖ, తదితరులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఐ కృష్ణా నాయక్, ఇన్‌చార్జ్ హెచ్ఎంజీ ఉషారాణి, ఉపాధ్యాయులు కే కోటేశ్వరరావు, బాజీబాబు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ అప్పు ఎంతో చూపాలి

● సమావేశంలో అధికారులను నిలదీసిన ఛైర్మన్



మున్సిపల్ ఛైర్మన్ డాక్టరు దస్తగిరి

వినుకొండ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలో కనీసం తెచ్చిన అప్పు ఎంత, ఎంత చెల్లించాలనే విషయం తెలియాలా లేదా అని మున్సిపల్ ఛైర్మన్ డాక్టరు దస్తగిరి అధికారులను నిలదీశారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో మునిసిపాలిటీ బడ్జెట్‌ను సభలో ఆయన ప్రవేశపెట్టారు. బడ్జెట్ అంశాలను మున్సిపల్ కౌన్సిలర్లుకు అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో 2024-25 సంవత్సరానికి మున్సిపల్ రెవెన్యూ రూ.14,79,55,000ఉండగా ఖర్చులు రూ.12,64,12,000, మిగులు రూ.2,15,43,000 కోట్లు ఉందని అధికారులు సభ దృష్టికి తీసుకురావడంతో 4వ వార్డు కౌన్సిలర్ ఇందుమతి మాట్లాడుతూ గతంలో మునిసిపాలిటీకి రూ.6కోట్లు అప్పు ఉందని, ఇప్పుడు నివేదికలో రూ.2కోట్లు మిగులు ఉన్నట్లు చూపటంపై ఆమె నిలదీశారు. అనంతరం 30వ వార్డు కౌన్సిలర్ షకీల మున్సిపల్ ఛైర్మన్ చూపిన పనులకు కనీసం రూ.10వేలు చెల్లించలేకపోయారని విమర్శించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ వాస్తవానికి వినుకొండ మున్సిపాలిటీ అప్పుల్లో ఉందన్నారు. ఈ అప్పును జనరల్ ఫండ్‌లో చూపిస్తామని, వచ్చిన ఆదాయాన్ని వారికి చెల్లించడం జరుగుతుందని తెలిపారు. సభలో బడ్జెట్ ఆమోదం పొందిన అనంతరం సభను ఛైర్మన్ వాయిదా వేశారు. సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో వాటిని కూడా వాయిదా వేసినట్లు సభ్యులకు ఆయన వివరించారు.

అధికారుల గైర్హాజరుపై ఎంపీడీవో అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జయశ్రీ, జడ్పీటీసీ విజయలక్ష్మి తదితరులు

వినుకొండ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ చింతం జయశ్రీ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సమావేశానికి మండల స్థాయి వివిధ శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ఎంపీడీవో పుట్టారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశం అంటే చిన్న చూపా, గతంలో ఒకసారి సమావేశానికి రాని అధికారులకు గుర్తు చేశామని, ఇప్పుడు కూడా అధికారులు ఎందుకు హాజరుకావడం లేదని సిబ్బందిని నిలదీశారు. రానివారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మండలంలోని తిమ్మాయపాలెం, నడిగడ్డ, పిట్టంబండ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు తాగునీరు అవసరాల నిమిత్తం చేతిపంపులు మంజూరైనట్లు వాటిని త్వరలో ఏర్పాటుచేయాలని ప్రజాప్రతినిధులకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్ సభ దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని కొత్తపాలెం, నరగాయపాలెం, గోకనకొండ, సూరేపల్లి (రామిరెడ్డిపాలెం) నరగాయపాలెం, దొండపాడు, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో నివాస గృహాలకు సంయుక్త రీసర్వే చేయనున్నట్లు ఈవోపీఆర్డీ సుందరరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఓఆర్‌మ్యాప్ రావడం జరిగిందని, సర్వే సమయంలో నివాస గృహాల వివరాలను సర్వే సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. అదేవిదంగా గ్రామాల్లో సామూహిక చర్యల ద్వారా దోమలు నిర్మూలించి ప్రజలు ఆరోగ్యానికి చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. సమావేశానికి విద్యాశాఖ, విద్యుత్, పశువైద్య, రెవెన్యూ, ఫారెస్ట్ తదితర ప్రధాన శాఖ అధికారులు హాజరుకాకపోవడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరారు.

వైద్య శిబిరంలో అసిస్టెంట్ డైరెక్టర్ తనిఖీ

రొంపిచర్ల, జనవరి 30 (ఆంధ్రజోతి): మండలంలోని తుంగపాడులో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాలను పశువుల యజమానులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వివిధ పథకాలను అందజేస్తుందన్నారు. వైద్యులు సాయి మహేష్‌రెడ్డి శిబిరంలో పశువులను పరిశీలించి మందులను అందజేశారు. కార్యక్రమంలో బొడ్డపాటి సుబ్బారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని పలుకూరులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పలుకూరులో శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 1450 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు, 55 దూడలకు నట్టల నివారణ, 120 పాడి గేదెలు, పాడి ఆవులకు మందులు పంపిణీ చేశారు. సూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పీ శ్రీనివాస్ మాట్లాడుతూ పశు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు.

నేడు ఏనుగుపాలెం రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

వినుకొండ టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏనుగుపాలెంలో నూతనంగా నిర్మించిన సీతాసమేత రాములవారు దేవాలయ నూతన ప్రతిష్టా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ప్రతిష్టా కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుతోపాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామాల పరిశుభ్రతే లక్ష్యంగా క్లాప్ మిత్రలు పని చేయాలి: రబ్బానీ

నూజెండ్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా క్లాప్ మిత్రలు పనిచేయాలని, ప్రతిరోజు గ్రామాల్లో ఇండ్ల నుంచి చెత్తను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి సంపద సృష్టి కేంద్రాలకు తరలించాలని ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ ఎస్‌కే రబ్బానీ అన్నారు. గురువారం మండలంలోని జంగాలపల్లి, తలార్లపల్లి గ్రామాల్లో సంపద సృష్టి కేంద్రాలు పరిశీలించి సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మండల కో-ఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ అధ్యక్షుడిగా కాసుల వెంకటరవీంద్ర ఏకగ్రీవం

వినుకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వినుకొండ వాసవి క్లబ్, జిల్లా క్యాబినెట్‌లో ఎంపికైన వారికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ జిల్లా గవర్నర్ మునగాల చిరంజీవి నియామక పత్రాలను అందజేశారు. వాసవి క్లబ్ వినుకొండ అధ్యక్షుడిగా కాసుల వెంకట రవీంద్ర, సెక్రటరీగా టంగుటూరి వీరబ్రహ్మం, ట్రెజరర్‌గా సిద్దా నరేష్, వనిత క్లబ్ ప్రెసిడెంట్‌గా జి.శేషధ్వజ, సెక్రటరీ బచ్చు లక్ష్మీహారిక, ట్రెజరర్‌గా కొత్తమాసు శిరీషా, వాసవి యూత్ అధ్యక్షుడిగా గుర్రం బాలసాయి కుమార్, సెక్రటరీగా దేసు హరి, వాసవి క్లబ్ వైభవం వెల్లటూరు అధ్యక్షుడిగా గజవల్లి వెంకటసుబ్బయ్య, సెక్రటరీగా అరవపల్లి సుబ్రహ్మణ్యం, ట్రెజరెర్‌గా కోటా శ్రీను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

ఉష్ణ మండల నిర్లక్ష్య వ్యాధులపై అవగాహన

నరసరావుపేట లీగల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మలేరియా కార్యాలయంలో గురువారం ప్రపంచ ఉష్ణ మండల నిర్లక్ష్య వ్యాధుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా మలేరియా అధికారి కె రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 30వ తేదీన ప్రపంచ ఉష్ణ మండల నిర్లక్ష్య వ్యాధుల దినంగా పాటిస్తారన్నారు. ఆహారపు అలవాట్లు, జీవన విధానాలు, పర్యావరణం, ఆరోగ్యంపై ఎలా ప్రభావం చూపుతాయో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాస్, కె.శ్రీనివాసరావు, మలేరియా సిబ్బంది పీపీ యూనిట్ పాల్గొన్నారు.



ఉత్తమ పంచాయతీ సర్పంచ్ గా అవార్డు అందుకున్న మద్దినేడి శివరామకృష్ణను సత్కరిస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

ఉత్తమ సర్పంచ్ శివరామకృష్ణకు ప్రత్తిపాటి సత్కారం

చిలకలూరిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌గా న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దిన వేడుకలలో కేంద్ర మంత్రి నుంచి అవార్డు అందుకున్న సందెపూడి గ్రామానికి చెందిన మద్దినేడి శివరామకృష్ణను గురువారం స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు తన నివాస గృహంలో అభినందించి సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆయన సందెపూడి అభివృద్ధికి ఎంతో కృషిచేసి దేశస్థాయిలో అవార్డు తీసుకోవడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ కరిముల్లా, తేళ్ల సుబ్బారావు, జవ్వాజి మదన్ మోహన్ పాల్గొన్నారు. శివరామకృష్ణకు యడ్లపాడు మండల టీడీపీ నాయకులు ముద్దన నాగేశ్వరావు అభినందనలు తెలిపారు.

స్కూల్ మ్యాపింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి: కలెక్టర్ అరుణ్ బాబు

నరసరావుపేట రూరల్, జనవరి 30: (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో స్కూల్ మ్యాపింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పల్నాడు జిల్లాలోని 28 మండలాల విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల పునః వ్యవస్థీకరణ జీవో నెంబర్ 117కు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు సిద్ధం చేసే అంశాలపై మండలాల వారీగా సమీక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మొండి బకాయిదారులకు నోటీసులు

మున్సిపల్ ఆర్వో సుబ్బారావు



చిలకలూరిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పేరుకుపోతున్న ఆస్తి పన్ను మొండి బకాయిలు వసూళ్ల కోసం ఇప్పటికే 450మందికి నోటీసులు జారీ చేశామని మున్సిపల్ ఆర్వో పీ సుబ్బారావు తెలిపారు. పట్టణంలో కొత్తగా 720 కట్టడాలను ఆస్తి పన్ను పరిధిలోకి తెచ్చామని, తద్వారా మున్సిపాలిటీకి ఏడాదికి రూ.85లక్షల మేర ఆదాయం పెరిగినట్లు చెప్పారు. మార్చి నెలాఖరులోగా రూ.6కోట్ల ఆస్తి పన్ను వసూళ్ల చేసి, 95 శాతం పన్ను వసూళ్ల లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. గత ఏడాది జనవరి చివరికి రూ.3.87 కోట్ల ఆస్తి పన్ను వసూలు కాగా, ఈ ఏడాది ఇప్పటికే రూ.5 కోట్లకు పైగా పన్ను వసూళు చేసినట్లు చెప్పారు. పట్టణ ప్రజలు సహకరించి మునిసిపల్ పన్నులను తక్షణం చెల్లించాలని కోరారు. ఈ మార్చి నెలా ఖారుకు 95 శాతం మేరకు ఆస్తి పన్ను వసూళు చేయాలని చిలకలూరిపేట మున్సిపల్ యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది ఇప్పటికే 41శాతం మేరకు ఆస్తిపన్ను వసూలు జరిగింది. మొత్తం 24,514 ప్రైవేట్ కట్టడాలు మున్సిపల్ పరిధిలో ఉన్నాయి. వాటి ద్వారా ఏడాదికి రూ.12.12 కోట్ల వరకు ఆస్తి పన్ను డిమాండ్‌గా ఉంది. ఇందులో ఇప్పటికే రూ.5కోట్ల మేరకు పన్ను వసూళ్ల కాగా, ఇంకా రూ.7.12 కోట్లు వసూళ్ల కావాల్సి ఉంది. చిలకలూరిపేట మున్సిపాలిటీలో పసుమర్రు, గణపవరం పంచాయతీలు విలీనం చేశారు. అయితే, ఆ రెండు పంచాయతీలు మున్సిపాలిటీలో చేరడంపై కోర్టు కేసులు నడుస్తున్నాయి. దీంతో, అక్కడి పన్నును ఆ పంచాయతీలే వసూళ్ల చేస్తున్నాయి. కానీ, ఈ రెండు పంచాయతీలకు సంబంధించిన ఆస్తి పన్ను బకాయిలు సుమారు రూ.12.38 కోట్లు చిలకలూరి పేట మున్సిపల్ లెక్కల్లో కనిపిస్తున్నాయి. దీంతో ఉన్నతాధికారుల దృష్టిలో ఆస్తి పన్ను బకా యిలు ఎక్కువగా ఉన్న మున్సిపాలిటీగా చిలకలూరిపేట కనిపిస్తున్నది.

ఉర్దూ స్కూళ్లను విలీనంచేయవద్దని డీఈవోకు వినతి

నరసరావుపేట టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ స్కూళ్లను తెలుగు పాఠశాలలో విలీనం చేసే ప్రయత్నాన్ని విరమించుకోవాలని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. గురువారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఎంహెచ్‌పీఎస్, మాల మహానాడు, సీపీఐ, టీడీపీ మైనారిటీ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించి, డీఈవో ఎల్ చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ ఉర్దూ భాషను రాష్ట్ర ప్రభుత్వం రెండో అధికారిక భాషగా ప్రకటిస్తే, ఇక్కడ అధికారులు మాత్రం ఉర్దూ భాషను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మాబు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, సీపీఐ నాయకడు ఉప్పలపాటి రంగయ్య, ఎంహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, కార్యదర్శి ఖాసీం పీరా తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు పేటీఎం యంత్రాల అందజేత

శావల్యాపురం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలకందించే స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో పారదర్శకతను పెంచేందుకే ప్రభుత్వం పేటీఎం యంత్రాల విధానాన్ని ప్రవేశపెట్టిందని ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు అన్నారు. శావల్యాపురం మండల సమాఖ్య కార్యాలయంలో 4గ్రామాల వీవోఏలకు ఏపీఎం వాసుబాబు గురువారం పేటీఎం యంత్రాలను పంపిణీ చేశారు. ఏపీఎం మాట్లాడుతూ గతంలో 6 గ్రామాల్లోని వీవోఏలకు పేటీఎం మిషన్‌లు అందజేశామని, పేటీఎం మిషన్‌ల ద్వారా రుణాలు చెల్లించిన మహిళలకు వెంటనే ఆన్‌లైన్ బిల్లును అందజేయడం జరుగుతుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి మండలంలోని 15గ్రామ పంచాయతీల్లో డ్వాక్రా మహిళలకు రూ.5కోట్లు రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటివరకు రూ.3కోట్లు రుణాలు పూర్తయిందన్నారు. మరో 205మంది మహిళలకు రూ.1.87కోట్ల రుణాలు మంజూరు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వీవోఏలు డ్వాక్రా మహిళలకు అందుబాటులో ఉంటూ రికార్డులు పెండింగ్ లేకుండా చూడాలని, మహిళలు తీసుకొన్న రుణాలు సకాలంలో చెల్లించి ప్రభుత్వ రాయితీలను పొందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అకౌంటెంట్ వెంకాయమ్మ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ గ్రామ సభలు

నూజెండ్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీ అప్పాపురం, గుర్రపునాయుడుపాలెం గ్రామాల్లో 16వ ఉపాధి హామీ సోషల్ ఆడిట్ గ్రామ సభలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సంవత్సరం ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేసిన పనులను, కూలీలకు ఇచ్చిన వేతనాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలపై సోషల్ ఆడిట్ బృందాలు పరిశీలించిన అంశాలను గ్రామ సభలో తెలియజేశారు. అప్పాపురంలో జరిగిన గ్రామ సభలో ములకలూరు డీసీ ఛైర్మన్ నక్కా బుల్లీశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జానీ బాషా, ఏపీవోలు ఆంజనేయరాజు, కట్టా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
OS 59/2019 in EP 27/2023
Between
తూమగుంట్ల సుబ్బా రావు వగైరాలు ....డి.హెచ్.ఆర్.
Vs
కూనిశెట్టి శ్రీనివాసులు ....జె.డి.ఆర్.

పై నెంబర్ ఇ.పి.ని ఇందలి డి.హెచ్.ఆర్. తనకు రావలసిన బాకీ వసూలు నిమిత్తము ఇందలి జె.డి.ఆర్.ల పైన ఇ.పి.ని దాఖలు చేసుకొని ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని పై కోర్టు వారి ఎదుట వేలమునకు తీసుకొని వచ్చినారు. శ్రీ కోర్ట్ వారు 15-02-2025 న ఉ.గం. 10:30ల నుండి షెడ్యులు దాఖలా ఆస్తిని వేలము వేయుటకు నిర్ణయించినారు. కావున పాటదారులు ది. 15-02-2025 న ఉ.గం. 10:30లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై వేలంపాటలో పాల్గొనవలసి నదిగా యావన్మందికి తెలియజేయడమైనది. షెడ్యూలు : పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్, నరసరావుపేట సబ్ డిస్ట్రిక్, నరసరావుపేట మండలం, నరస రావుపేట గ్రామ రెవిన్యూ డి.నెం. 43/ఇ లో య.0.24 సెంట్లలో 1161.6 చ.గ. ఖాళీ స్థలమునకు హద్దులు. తూర్పు : బోలిశెట్టి వెంకటేష్ గారికి విక్రయించిన ఆస్తి హద్దు. దక్షిణం : గోల్డ్ స్పాట్ వెంకటేశ్వర్లు గారి భూమి హద్దు. పడమర : ఇస్సప్పాలెం డొంక హద్దు. ఉత్తరము : బోలిశెట్టి వెంకటేష్ గారి భూమి హద్దు. పై హద్దుల మధ్య 1161.6 చ.గ ల ఖాళీ స్థలము.
డి.హెచ్.ఆర్. విలువ : 8,00,000/-
అమీనా విలువ : 90,00,000/-
వేలం వాయిదా : 15-02-2025
(బై ఆర్డర్ ఆఫ్ కోర్టు)
శ్రీ బొడ్డుచర్ల అనిల్ కుమార్,
అడ్వకేట్ ఫర్ డి.హెచ్.ఆర్స్.నరసరావుపేట